



# వరాలివ్వమ్మా.. వరలక్ష్మి



దేవిచౌక్‌లో రాజరాజేశ్వరి

రాజమండ్రిలో భక్తుల క్యూ

వరలక్ష్మీ వ్రతంలో బత్తుల వెంకటలక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం వరలక్ష్మీవ్రతం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శుక్రవారం వేకువ జామునే పెద్ద ఎత్తున గోదావరి స్నానాలు చేశారు. భక్తులు తమ తమ ఇళ్లకు మామిడాకుల తోరణాలు, చామంతి పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించుకున్నారు. ఎవరింట్లో వారు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించు కున్నారు. కలశస్థాపన చేసి బంగారులక్ష్మీదేవి రూపును ఉంచారు. పండ్లు, పువ్వులు, దూపదీప నైవేద్యాలు సమర్పించారు. వరలక్ష్మి పూజను కుటుంబ సమేతంగా నిర్వహించుకుని ముత్తయిదువులకు తాంబుళాలు ఇచ్చి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఉపవాసం ఉండి సాయంత్రం రాజమహేంద్రవరంలోని దేవిచౌక్ బాలత్రిపుర సుందరీదేవి, వెంకటేశ్వనగర్‌లో మహాలక్ష్మి, వరలక్ష్మి, శ్యామలాంబ, నిడదవోలు కోటసత్తెమ్మ,ఉంద్రాజవరం పాలంగి ముత్యాలమ్మ తది తర అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి దర్శించుకున్నారు.

## లక్ష్మీ..వైభవం!

### రూ.30 లక్షలతో అలంకరణ

కడియం,ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. కడియపులంక పుంతలో మునలమ్మ అమ్మవారిని శ్రావణమాసం, వరలక్ష్మీవ్రతం, శుక్రవారం సందర్భంగా కరెన్సీనోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు. సుమారు రూ. 30 లక్షలు అమ్మవారి అలంకరణకు ఉపయోగించినట్టు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

# ఇస్తారా.. ఎలాగని!

నాడంతా ఇష్టారాజ్యంగా



## సీనరేజి కాంట్రాక్టుకు ముమ్మర పైరవీలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో సీనరేజి వసూళ్ల కాంట్రాక్టు గడువు ముగియడంతో మళ్లీ దక్కించుకునేందుకు సుధాకర్ ఇన్‌ఫ్రా పావులు కదుపుతోంది. గత నెల 13వ తేదీతో కాంట్రాక్టు రద్దవడంతో తిరిగి వర్క్ ఆర్డరు తెచ్చుకునేందుకు పైరవీలు ముమ్మరం చేసింది. గత వైసీపీ హయాంలో అడ్డగోలుగా ఈ కంపెనీకి జగన్ సర్కారు రెండేళ్లపాటు సీనరేజీ వసూలు కాంట్రాక్టు కట్టబెట్టేసింది. దీంతో ఎక్కడికక్కడ ముక్కుపిండి సీనరేజీ వసూళ్లు చేసి కోట్లకు కోట్లు లాభాలు అర్జించారు. అయితే గడువు ముగియడంతో సదరు సంస్థ తిరిగి మళ్లీ దక్కించుకునేందుకు తెగ ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం టెండర్లు పిలిస్తే కాంట్రాక్టు దక్కుతుందో లేదోనన్న అనుమానంతో ముందే పైరవీలకు దిగుతోంది. నెల్లూరుకు చెందిన సదరు కాంట్రాక్టరు ఇప్పటికే గనుల శాఖకు రూ.25 కోట్ల వరకు బాకీ పడ్డారు.అధికారులు ఒత్తిడి తెచ్చినా కట్టలేదు.మరో పక్క ఇటీవల కాంట్రాక్టు గడువు ముగుస్తోన్న సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సదరు కంపెనీ ప్రతినిధులు బిల్లులే లేకుండా నేరుగా నగదు వసూలు చేయడం వివాదాస్పదమైంది.

### అప్పట్లో అప్పనంగా కొట్టేసి...

ఉమ్మడి జిల్లాలో భారీ నల్లరాతి కొండలు, గ్రావెల్, మట్టి,లేటరైట్ తవ్వకాలకు అనుమతులివ్వడం ద్వారా ఏటా కోట్లలో ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, సీతానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా గనుల శాఖకు అధిక రాబడి వస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గనుల శాఖకు ఏటా రూ.407 కోట్ల వరకు రాబడి వచ్చేది. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు దీనిపైనే కన్నేశారు. చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు బాధ్యత నుంచి గనుల శాఖను పక్కన పెట్టి మూడో కంటికి తెలియకుండా మొట్టమొదటిసారిగా సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టేశారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు ఇచ్చారు. రెండేళ్లకు కలిపి కేవలం ప్రభుత్వానికి రూ.233 కోట్లు చెల్లిస్తే చాలని షరతు విధించారు. అది కూడా నెలకు రూ.9.70 కోట్ల చొప్పు న 24 వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు ఇచ్చారు. భారీగా ఆదాయం పిండాల్సిన చోట కారుచౌకగా కట్టబెట్టేసి తెరవెనుక అప్పటి ప్రభుత్వ పెద్దలు కోట్లలో నొక్కేశారు.

### మళ్లీ మాకే దక్కాలి...

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సీనరేజీ కాంట్రాక్టు రద్దయి 25 రోజులు అవుతోంది. దీంతో తిరిగి ప్రభుత్వం కొత్తగా టెండర్లు పిలిచి సీనరేజీ వసూలు అర్హత గల కంపెనీకి కట్టబెట్టాలి. అయితే ఇంకా కసరత్తు మొదలవలేదు. ఇటీవల ప్రభుత్వం కొన్ని ఉమ్మడి జిల్లాలకు కొత్తగా సీనరేజీ వసూళ్లకు ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచింది. గడువు ముగిసిన జిల్లాలకు ఇంకా టెండర్లు పిలవలేదు. త్వరలో వీటిని జారీ చేసే అవకాశం ఉంది. కొత్త కంపెనీ ఖరారయ్యే వరకు ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో గనులశాఖ సీనరేజీ వసూలు చేస్తోంది. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు స్వీకరిస్తోంది. ఈ క్రమంలో అసలు ఎవరు చెల్లిస్తున్నారు? ఎవరు చెల్లించకుండా ఖనిజాలను తరలిస్తున్నారనేది గనులశాఖ అసలు పట్టించుకోవడం లేదు. మరో పక్క కొత్త టెండర్లు పిలిస్తే పోటీ పెరిగి తనకు కాంట్రాక్టు దక్కదనే ఆందోళన సుధాకర్ ఇన్‌ఫ్రాను వేధిస్తోంది.గత వైసీపీ హయాంలో ఉమ్మడి జిల్లా సీనరేజీ వసూలు కాంట్రాక్టును తెర వెనుక లాలూచీతో రెండేళ్లకు కేవలం రూ.233 కోట్లే చెల్లించేలా కారుచౌకగా కొట్టేసింది.ఇప్పుడు కొత్తగా టెండర్లు పిలిస్తే ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజీ డబ్బులను భారీగా పెంచాలి. దాదాపు రెట్టింపుస్థాయిలో అయినా బిడ్ అమౌంట్ పెంచాల్సి ఉంటుందని అధికారులే చెబుతున్నారు. తద్వారా ఖజానాకు ఆదాయం పెరుగుతుంది. సదరు కాంట్రాక్టరు మాత్రం టెండర్ల వరకు వెళ్లకుండా మళ్లీ పాత ధరకే కారుచౌకగా వసూళ్ల కాంట్రాక్టు కొట్టేయాలని ప్రయత్నం చేస్తున్నారు.

### బకాయి రూ.25 కోట్లు

సదరు కాంట్రాక్టరు ప్రభుత్వానికి రూ.25 కోట్ల వరకు బాకీ పడ్డారు. గత వైసీపీ హయాంలో రౌతులపూడిలో అర బిందో సంస్థ నిర్మించే కొత్త పోర్టు కోసం భారీ నల్లరాయి కొండను కేటాయించారు.ఇందుకోసం ఆ కంపెనీ ప్రభుత్వానికి సీనరేజీ కట్టాల్సి ఉంది. కానీ అరబిందో కోసం జగన్ సర్కారు ఒక్క రూపాయి కూడా సీనరేజీ గనులశాఖకు కట్టక్కర్లేకుండా రూ.20 కోట్ల వరకు మినహాయింపు ఇచ్చేసింది. అరబిందో కోసం రద్దు చేసిన సీనరేజీ వల్ల తన రాబడి తగ్గిపోయిందని రూ.20 కోట్ల సీనరేజీ డబ్బులో కొంత వాటా తన పాత బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ అప్పట్లో గనులశాఖను సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా కోరింది.ఈలోపు ఎన్నికలు వచ్చేయడంతో సదరు కాంట్రాక్టర్ అనుకున్న పనికాలేదు. ఈలోపు ప్రభుత్వం మారడంతో అధికారులేమో సర్దుబాటు కుదరదని, డబ్బులు చెల్లించాలని తెగేసి చెప్పారు. అయినా ఇంకా ఈ సంస్థ బాకీలు చెల్లించ లేదు. తిరిగి నష్టపోయానంటూ ఇప్పుడు కొత్తగా కాంట్రాక్టు కొట్టేయడానికి పావులు కదుపుతోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొండలు, గుట్టలు, గ్రావెల్,క్వారీలు ఉన్న ప్రతి చోటా సదరు సంస్థ సొంతంగా మనుషులను నియమించి, మైనింగ్ ఏరియాలో సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఎవరు ఏ చిన్న మట్టి,గ్రావెల్ తవ్వుకున్నా ముక్కుపిండి సీనరేజి వసూలు చేసింది. ప్రత్తిపాడు,తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్లరాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి వదల కుండా ముక్కుపిండి నెలనెలా కోట్లలో డబ్బులు పిండేసింది.ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ.9.70 కోట్లకు బదులు రూ.15 కోట్లకు పైగా వసూలు చేసింది.ఈ కంపెనీకి గత నెల 13తో సీనరేజీ వసూలు కాంట్రాక్టు రద్దయిపోయింది.పోతూపోతూ సదరు కంపెనీ ప్రతినిధులు ఉమ్మడి జిల్లాలో బిల్లులు లేకుండా నేరుగా నగదు వసూళ్లకు దిగింది. దీంతో రౌతులపూడి, కోనసీమ జిల్లాల్లో జనం తిరగబడ్డారు.

- సీనరేజీ కాంట్రాక్టుపై అయోమయం
- గత నెల 13న ముగిసిన గడువు
- తప్పుకున్న సుధాకర్ ఇన్‌ఫ్రా
- తిరిగి టెండర్ల ద్వారా కొత్త కంపెనీ
- మళ్లీ చాన్స్‌కు పాత కంపెనీ పావులు
- కాంట్రాక్టు పొడిగించేలా పైరవీలు
- గత వైసీపీలో రూ.233 కోట్లు

# గో..గో.. గోల్డ్!



## బంగారం ధర పరుగు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వరలక్ష్మి వ్రతం రోజున బంగారం ధర భారీగా పెరిగింది. బంగారం ధరల పెరుగుదల చూసి సామాన్య మధ్యతరగతి ప్రజలు నిరాశకు గురవుతున్నారు.వారికి బంగారంగానే మారిపోయింది. పెళ్లిళ్లు, ఇతర పండగలకు బంగారం కొనడం ఆనవాయితీగా మారింది. కానీ ఈ ఏడాది జనవరి నుంచి ఒకటే పెరుగుదల. ముందు ముందు ఇంకా పెరిగిపోతుందేమోననే భయం. దీంతో అప్పో సప్పో చేసి కాస్తో కూస్తో బంగారం కొనుగోలు చేయాలనే ఆశ మొదలైంది. కానీ ధరలు పెరిగిపోతుండడంతో సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు నిరాశ కలుగుతోంది.ఇంత ధరకు చేరడం ఇదే మొదటి సారని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం రాజమండ్రి మార్కెట్‌లో 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.94 వేల 700 లకు చేరింది. ఇక 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర లక్ష ఎప్పుడో దాటేసింది. ప్రస్తుతం ఒక లక్షా 3 వేల 300గా ఉంది. ఇక వెండి ధర లక్షకు పైగా దాటేసింది.ప్రస్తుతం కిలో వెండి ధర రూ.ఒక లక్షా 18 వేల 100గా ఉంది. బంగారం వెండి ధరలు పోటీపడుతున్నాయి.గతంలో వెండి ధర కేజీ రూ.50 వేల లోపే ఉండేది. ప్రస్తుతం అది అమాంతం పెరిగిపోతోంది. ఎక్కడా తగ్గుదల లేదు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రతి ఒక్కరూ బంగారు రూపు కొనుక్కోవడం ఆనవాయితీ.ఈ ఏడాది మాత్రం వాయిదా వేసుకున్నారు. రూపు లేకుండా పూజ కానిచ్చారు.

**భారీగా పెరుగుతున్న ధరలు**

**22 క్యారెట్ 10 గ్రాములు రూ.94,700**

**24 క్యారెట్ 10 గ్రాములు రూ.1,03,300**

**వెండి కేజీ రూ.లక్షా 18వేల 100**

## లక్ష్మీదేవి.. రూపులక్యూ..



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8( ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సింహచల్‌నగర్ శ్రీవరాహలక్ష్మినృసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఐదు వేల గోల్డ్‌ప్లేటెడ్ లక్ష్మీదేవి రూపులను పంపిణీ చేశారు. రూపులకు భక్తులు క్యూకట్టారు.దీంతో కోరుకొండ రోడ్డు సింహచల్‌నగర్‌లో కిక్కిరిసింది. ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసి భక్తులకు గోల్డ్‌ప్లేటెడ్ రూపులను అందించారు.

## కురిసింది వాన



రాజమహేంద్రవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా మండిపడుతున్న ఎండలతో ఇబ్బంది పడిన నగరవాసులకు శుక్రవారం రాత్రి పడిన వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. సాయంత్రం నుంచి మేఘావృతమైనా..రాత్రి 9గంటల సమయంలో ప్రారంభ మైన వాన జోరుగా కురిసింది. దీంతో నగరంలోని పలు జంక్షన్లు జలమయమ్యాయి. వరలక్ష్మీ వ్రతం కావడంతో సాయంత్రం సరదాగా బయటకు వెళ్లినవారు, దేవాలయాలకు, మార్కెట్లకు వెళ్లిన వాళ్లకు ఇబ్బందులు తప్పలేదు. ఇటీవల అడపాదడపా వర్షం పడుతున్నా అది ఒక ప్రాంతానికి పరిమితమై నీళ్ల చిలకరింపులా ఉంటోంది. అయితే శుక్రవారం రాత్రి జోరు వాన కురవడంతో నగరంలో వాతావరణం చల్లబడింది.



## యూరియా..ఏదయా!

కొవ్వూరు,ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా అందుబాటులో లేక అన్నదాతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సార్వాలో నారు వేసిన 30 రోజుల్లో ఎరువులు వేయాలి.. యూరియా కొరత కారణంగా 50 రోజులు దాటినా వేయలేదు.కొందరు వ్యాపారులు పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని రూ.270ల బస్తా రూ.400 నుంచి రూ.500ల వరకు విక్రయిస్తున్నారు.దీంతో రైతాంగం లబోదిబోమంటున్నారు. వ్యవసాయ అధికారులకు ముందు చూపు లేక ఈ పరిస్థితి ఏర్ప డిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదించి రైతులకు అవసరమైన యూరియాను సరఫరాచేసి అన్న దాతలను ఆదుకోవాలని రైతు సంఘం నాయకుడు కెవికె రంగారావు డిమాండ్ చేశారు.

# తెలుగు.. వెలుగేది!



## ఇంకనూ ఆరంభం కాని తెలుగు వర్శిటీ

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపి, నోటిఫికేషన్ కూడా ఇచ్చిన సంగతి తెలిసిందే. రెండు నెలలు దాటినా ఇంకా బొమ్మూరు తెలుగు వర్శిటీ ఆవరణలో ఎలాంటి కదలిక లేదు.2024- 25 విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ అడ్మిషన్లు ఆగిపోయాయి. ఫైనల్ విద్యార్థుల పరీక్షలు ఇటీవల పూర్తయ్యాయి. సాధారణంగా జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టులో తరగతులు ఆరంభిస్తారు. కానీ ఇంకా వీసీ,రిజిస్ట్రార్, ఫ్యాకల్టీ నియామకాలు ఏమీ లేకపోవడంతో ఈ ఏడాది అడ్మిషన్లపై సందేశం కలుగుతోంది.

### రాష్ట్ర విభజన తర్వాత..

2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఏపీలో తెలుగు పీఠం ఉనికి కోల్పోయింది. బొమ్మూరు తెలుగు పీఠంలో గతేడాది నుంచి అడ్మిషన్లు ఆగిపోయాయి. ఈ ఏడాది జూలై 3న ఎంఏ తెలుగు చివరి బ్యాచ్ పరీక్షలు పూర్తి కావడంతో పీఠం ఉనికి ప్రశ్నార్థకమైంది. ఈ పరిస్థితిలో రాజమండ్రిలో తెలుగు వర్శిటీ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన తెలుగు కు వెలుగునిచ్చింది.1986 ఏప్రిల్‌లో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ నందమూరి తారక రామారావు హైదరాబాద్‌లో ఉన్న తెలుగు వర్శిటీలో భాగంగా బొమ్మూరులో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పీఠం ఏర్పాటు చేశారు. బొమ్మూరు కొండపై సుమారు 45 ఎకరాలు, సమీపంలోని మరో 10 ఎకరాల భూమిని పీఠానికి దఖలు పరిచారు.పీఠంలో 300మంది పీహెచ్‌డీలు చేయగా, 450 మంది ఎంఫిల్, 550 మంది తెలుగు ఎంఏ చేశారు.

### ఇదీ ప్రస్తుత పరిస్థితి

ప్రస్తుతం పీఠంలో 14 మంది ఉద్యోగులు ఉన్నారు. భవనాలు శిథిలమయ్యాయి. కేవలం 20 ఎకరాల స్థలం మాత్రం మిగిలింది. కానీ 29 వేల పుస్తకాలతో గ్రంథాలయం మాత్రం నిత్యనూతనంగా ఉండడం గమనార్హం. 2016 వరకూ ఇక్కడ అన్ని కోర్సులు జరిగాయి. 2024-25 నుంచి మొత్తం అడ్మిషన్లు ఆగిపోయాయి. ఉద్యోగులకు జీతాలు కూడా రాని పరిస్థితి ఉంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఓఎస్‌డీని నియమించి జీతాలు ఇస్తున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుతో తెలుగు నేల పొంగి పరవశించిపోతున్నట్టు ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఇక్కడ తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రముఖులు కోరిన సంగతి తెలిసిందే.చివరికి ప్రజల కోరికను చంద్రబాబు నెరవేర్చారు.రెండు నెలల కిందట అమరావతిలో జరిగిన కేబినెట్ సమావేశంలో రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.ఈ మేరకు నోటిఫికేషన్ జారీ అయినట్టు ప్రకటించింది. ఏపీలో విశ్వవిద్యాలయం కార్యకలాపాలు ప్రారంభానికి వీలు కల్పించింది. ఏపీలో ఉన్న మూడు సాహిత్య పీఠాల నిర్వహణకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుందని కేబినెట్ విశదీకరించింది.ఈ మేరకు ప్రభుత్వం తక్షణం వీసీని నియమించి తెలుగువిశ్వవిద్యాలయ పాలన ప్రారంభించాలని..ఈ ఏడాది నుంచి తరగతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

- నోటిఫికేషన్ ఇచ్చి రెండు నెలలు
- ఏర్పాటు కాని ప్రధాన కార్యాలయం
- వైస్ చాన్సలర్ ఊసు లేదు
- ఈ ఏడాది తరగతుల సంగతేంటో
- ప్రభుత్వ నిర్ణయంతో ప్రాణం
- ఇంకనూ ఊపిరిపోసుకోని వైనం
- శిథిలావస్థకు చేరిన భవనాలు
- భాషాభిమానుల ఎదురుచూపులు

## సీపీఐ జిల్లా కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8( ఆంధ్ర జ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శిగా రెండో సారి తాటిపాక మధు ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. సీపీఐ రాష్ట్ర నాయకుల సమక్షంలో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా కార్యదర్శిగా తాటిపాక మధు,సహాయ కార్యదర్శులుగా కుండ్రపు రాంబాబు, రేఖా భాస్కరరావు, సహాయ కార్యవర్గ సభ్యులుగా వి.కొండలరావు, కే.జ్యోతిరాజు, పంతం నాగేశ్వరరావు, పి.లావణ్య,తోట లక్ష్మణ్, చింతలపూడి సునీల్, పి.త్రిమూర్తులు, కే.శ్రీనివాస్ ఎంఎస్‌కే.ప్రసాద్ ఎన్నికయ్యారు.



## సజీవనది..

### కష్టమొస్తే గోదారిలో దూకేస్తున్నారు

### శుక్రవారం మూడు కేసులు నమోదు

గోదారి.. ఆత్మహత్యలకు దారిగా మారిపోయింది.. ఎవరికైనా చిన్న కష్టం వస్తే ముందు వెనుకా ఆలోచించడంలేదు.. రోడ్ కం రైలు బ్రిడ్జి ఎక్కుతున్నారు.. గోదావరిలో దూకేస్తున్నారు.. శుక్రవారం కొవ్వూరులో జరిగిన సంఘటనలే అందుకు నిదర్శనం .. ఉదయం ఒక గుర్తుతెలియని మృతదేహాన్ని గోష్పాదక్షేత్రంలో గుర్తించి బయటకు తీశారు.. ఆ వెంటనే మరొక మహిళ రోడ్ కం రైలు బ్రిడ్జి పైనుంచి దూకేసి గల్లంతైంది ..ఈ కేసు చూస్తుండగానే మద్దురూలంక వద్ద గోదావరిలో మరో వృద్ధుడు దూకేశాడు.ఇలా శుక్రవారం పోలీసులు గోదావరి చుట్టూ పరుగులు పెట్టారు..

# ప్రకృతి..ఆకృతి!




ఎన్నెన్నో అందాలు.. అన్నింటా వర్ణాలు.. అని ఒక కవి అన్నారు.. అది నిజమే.. ఈ చిత్రాలే చూడండి.. ప్రకృతి మనకు ఎంతో ఇవ్వడమే కాదు.. ఎంతో నేర్పింది కూడా.. ఇవి ప్రకృతి గీసిన రక్షాబంధన్ ఆకృతి.. రాఖీ పండుగ రోజున సోదర ప్రేమను తెలుపుతూ రాఖీలు కడుతుంటారు. విలువైన కానుకలు ఇచ్చి సోదరులు వారి సోదరీమణుల పట్ల ఆత్మీయత చూపుతారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. తమ సోదరులు పదికాలాలు పచ్చగా ఉండాలని.. మొక్క వలే రోజురోజుకీ అభివృద్ధి చెందాలని ఇటీవల కాలంలో మొక్కలు ఇచ్చిపుచ్చుకునే సాంప్రదాయం వచ్చింది. ప్రస్తుతం కడియం నర్సరీలో లభించే ఈ రాఖీ పుష్పాలు అనేక రంగుల్లో లభ్యమవుతున్నాయి. మంచి పరిమాణంలో పువ్వు, దాని చుట్టూ రేఖలు ఉండి అందంగా ఉండే ఈ రాఖీ పుష్పం పేరు ప్యాసీ ఫ్లోరా అంటారు. దీనిని కౌరవులు-పాండవులు మొక్క అని కూడా పిలుస్తారు.

- కడియం

# శ్రీపాదుడే.. సోదరుడు



## శ్రీపాద శ్రీవల్లభుడికి రాఖీలు కట్టేందుకు తరలివచ్చిన మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు



పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదుడిని సోదరుడిగా భావించే మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల భక్తులు శ్రావణ (రాఖీ) పౌర్ణమికి ముందుగానే ఆయన జన్మ స్థలమైన కాకినాడ జిల్లా పిఠాపురం తరలివచ్చారు. దీంతో హోటళ్లు, లాడ్జీలు, ప్రైవేటు అతిథిగృహాలు కిటకిటలాడుతున్నాయి. శ్రీపాద శ్రీవల్లభులకు వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రావణి పౌర్ణమి రోజున రాఖీ కట్టడంతో ఈ రోజుకు విశేష ప్రాధాన్యం ఉంది. అదే సమయంలో మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు తమ ఇంట ఇలవేల్పుగా కొలిచే శ్రీపాద శ్రీవల్లభుడిని సోదరుడిగా భావిస్తారు. దీంతో రాఖీ (శ్రావణ లేదా జంధ్యాల) పౌర్ణమికి మహారాష్ట్ర, గోవా, ఉత్తరాది, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్, బెంగాల్, ఒడిసా, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి భారీగా తరలివచ్చారు. వారంతా నాలుగైదు రోజులు ఇక్కడే ఉండి పూజల్లో పాలుపంచుకుంటారు. రాఖీ రోజున సాధారణంగా మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు పొందుతారు. అందుకు భిన్నంగా మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల భక్తులు మాత్రం శ్రీపాద శ్రీవల్లభులు, ఈ క్షేత్రంలో ఉన్న ఔదుంబర వృక్షానికి రాఖీలు కడతారు. శ్రావణి పౌర్ణమి రోజున రాఖీలు కట్టడం ద్వారా శ్రీపాదుని ఆశీస్సులు లభిస్తాయని భక్తుల నమ్మకం. రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పలు ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ, అభిషేకాలు జరుగుతాయి. మహా సంస్థానానికి తరలివచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు. పాదగయ క్షేత్రంలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయ స్వామికి, ఆవరణలో ఉన్న అలక్‌నిరంజన్ దత్త బృందావనంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. సాయంత్రం పల్లకీ సేవ, పుష్పార్చన జరుగుతాయి. స్వయంభూ దత్తాత్రేయ స్వామికి లక్ష మల్లెల అర్చన జరుపుతామని ఈవో ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ చెప్పారు.



# అడవి ఒడి.. బతుకు బడి..



ఈ ఒక్క చిత్రంచాలు.. ఆదివాసీల జీవన చిత్రం వివరించడానికి.. ఇది వారి నివాసం.. ఇదే వారి ఆవాసం.. పైన తాటాకులతో చిన్న కప్పు తప్ప.. గోడల్లేవ్.. మేడల్లేవ్.. చివరికి గచ్చుల్లేవ్.. నాటికి.. నేటికీ ఇదే వారి జీవనవిధానం.. ఏళ్లు గడచిపోతున్నాయి.. అయినా నేటికీ అలాగే ఉన్నారు.. ప్రభుత్వాలు మార్చలేకపోతున్నాయి..

ఎంతో అభివృద్ధి చెందాం.. ఎన్నో సాధించాం.. అని జబ్బలు చరుచుకుంటాం.. ఒకసారి అడవి లోకి వెళ్లి ఆదివాసీలను చూస్తే.. మన సాధిం చింది ఏమిటో అర్థమైపోతోంది..ఎందుకంటే పూర్వం ఎలా ఉన్నారో నేటికీ అలాగే ఉన్నారు.. ఎక్కడా మార్పులేదు.. ప్రభుత్వాలు చట్టాలు చేస్తున్నా.. పథకాలు ప్రకటిస్తున్నా అవేం వారి చెంతకు చేరడంలేదు.. నేడు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

## మారని ఆదివాసీల బతుకు తీరు

- దరిచేరని పథకాలు..అందని ఫలాలు
- అభివృద్ధికి దూరంగా తండాలు
- హక్కుల కోసం పోరాటాలు
- నేడు ఆదివాసీ హక్కుల దినోత్సవం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

ఓ ప్రత్యేక సంప్రదాయం.. సంస్కృతి.. ఆచారం వారిది..వారి జీవనమంతా జల్ జంగిల్ జమీన్‌పైనే. ఆ మేరకే వారి ఆవాసాలు ఉంటాయి.వారే మూలవాసులుగా పిలవబడే ఆదివాసీలు. కాల క్రమంలో ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అడుగు మోపుతున్నప్పటికి ఆ సంఖ్య పరిమితమే. అందుకే రాజ్యాంగం లోని ఐదు,ఆరవ షెడ్యూల్‌లో వారి కంటూ ఓ ప్రత్యేక చట్టా లు, హక్కులు కల్పించబడ్డాయి.అయితే ఆ ఫలాలు తమకు సంపూర్ణంగా అందడం లేదన్నది వారి వాదనగా ఉంది. అభివృద్ధి పేరిట తమ మనుగడకే ముప్పు వాటిల్లుతోందన్న ఆవేదన వినిపిస్తోంది. 1994లో ఐక్యరాజ్య సమితి ఆదివాసీల జీవన స్థితిగతులపై ఓ అధ్యయనం చేసింది. ఇందులో భాగంగా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకై ప్రతి ఏడాది ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరుపుకోవాలని తీర్మానించింది. అప్పటి నుంచి ఆగస్టు 9న ఆదివాసీ ప్రాంతాల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఒక వేడుకలా జరుపుకుంటున్నారు. అయితే హక్కుల సాధన, మనుగడ కోసం ఆదివాసీ సంఘాలు అలుపెరగని పోరాటం చేస్తూనే ఉన్నాయి. ఖనిజ సంపద వెలికి తీసినా, నీటి ప్రాజెక్టులు నిర్మించతలపెట్టినా చివరకు అక్కడ ఆదివాసీలే నిర్వాసితులుగా మారాల్సిన పరిస్థితి ఉంది. మన రాష్ట్రంలో పోలవరం, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలలో ఖనిజ వెలికితీత ప్రదేశాలే ఇందుకు ఉదాహరణ. దీంతో తమ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆదివాసీ నాయకులు మొర పెట్టుకుంటున్నారు. హక్కుల సాధనకు పోరాటాలు చేయడంతోనే తమ జీవి తాలు తెల్లారిపోతు న్నాయంటున్నారు.దేశం మొత్తం మీద తొమ్మిది కోట్ల మంది జనాభా కలిగి ఉన్న ఆదివాసీల పండుగలను సైతం ప్రభుత్వాలు గుర్తించక పోవడం విడ్డూరం. చివరకు ఆదివాసీ సంతతి తమ మాతృభాషను సైతం మర్చిపోయే ప్రమాదం పొంచి ఉందంటున్నారు. తమ భాష పరిరక్షణలో భాగంగా మన్యంలో ప్రాథమిక విద్య ఆదివాసీ మాతృ భాషలో బోధించాలని పట్టుపడుతున్నారు. ఇది కొంతమేర ఆచరణలోకి వచ్చి ఆ తర్వాత ఆ తరహా బోధన పరిమితమైంది.

### వలస ఆదివాసీలది మరో వేదన

మన రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రాలకు ఛత్తీస్‌గఢ్ నుంచి పలు ఆదివాసీ కుటుంబాలు వలస వచ్చాయి. వారిలో అధికులు రిజర్వు ఫారెస్టునే తమ ఆవాసాలుగా ఎంచుకున్నారు. ఆ క్రమంలో ఎన్నో కష్టాలు పడ్డారు. జైళ్ల పాలయ్యారు. కాల క్రమంలో తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఆధార్, రేషన్, ఓటు హక్కులను కల్పించాయి. తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసి పాఠశాలలు ఏర్పాటు చేశాయి. చట్టంలోని నిబంధనల మేరకు వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే అవకాశం లేకుండాపోయింది. దీంతో వలస ఆదివాసీ సంతతి చదువులు అర్థంతరంగా నిలిచిపోతున్నాయి. పౌష్టికాహారం అందక ఆ చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్న సంఘటనలు చాలానే ఉన్నా యి. ఛత్తీస్‌గఢ్‌లో వీరంతా మురియా తెగకు చెం దిన వారుగా ఉన్నారు. తెలంగాణలోని ఖమ్మం, వరంగల్,మన రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలో దాదాపు ఈ తరహా కుటుంబా లు 20 వేల పైచిలుకే ఉన్నాయన్నది ఓ అంచనా.


మనకు కుళాయిలు వచ్చాయి.. మరి ఆదివాసీలకో నేటికీ.. నీటికి వారి శ్రమే ఆధారం..


యానాంలో వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.23 లక్షల కరెన్సీతో ధాన్యలక్ష్మిగా అలంకరించిన దృశ్యం


కాకినాడ జిల్లా అన్నవరంలో వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.3 లక్షల కరెన్సీతో ధాన్యలక్ష్మిగా అలంకరించిన దృశ్యం

# వరలక్ష్మీ వైభవం


రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో బాలాత్రిపురసుందరి అమ్మవారు

శ్రావణ మాసం మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపి అర్చకులు విశేష అలంకరణ చేశారు. వివిధ రూపాల్లో అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు.


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవికి నెమలి పింఛాలతో అలంకరణ


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏవీ అప్పారావు రోడ్డులో పుష్పాలంకరణలో సంతోషిమాత అమ్మవారు

# అనుబంధాల ఆత్మీయ వేడుక రక్షాబంధన్




(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాఖీ పండగంటే.. రాఖీ కట్టడం, రాఖీ కట్టించుకోవడం కాదు.. గిఫ్టులు ఇవ్వడం ఏ మాత్రం కాదు.. అక్క-తమ్ముడు, అన్న-చెల్లెలు మధ్య అనుబంధం చాటుకోవాలి. ఆ బంధం జీవితాంతం కొనసాగేలా భరోసానివ్వాలి. ముఖ్యంగా అన్నతమ్ముళ్లు తమ అక్కచెల్లెమ్మల కోసం వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలి. అప్పుడే ఆ బంధానికి విలువ.. ఆ ఆత్మీయ వేడుక జీవితంలో మధురానుభూతి నింపాలి.

మారుతున్న కాలానికి అనుగుణంగా రక్షణగా నిలవడం అనే పదానికి విస్తృతి పెరిగిందనే చెప్పాలి. రోజురోజుకీ పెరుగుతున్న ధరలు, ఉద్యోగ భద్రతపై అనుమానాలు నెలకొన్న తరుణంలో కేవలం భౌతిక రక్షణే కాకుండా ఆర్థికంగానూ వారికి భరోసా ఇవ్వాలి. అదే అక్కాచెల్లెళ్లకిచ్చే నిజమైన బహుమతి.


రాజమహేంద్రవరంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

కేవలం అక్కాచెల్లెళ్ల ఆరోగ్యానికే కాదు.. వారి భవిష్యత్తుకూ భరోసా కల్పించేలా బీమా పాలసీ కొనిపెట్టడం మంచి మార్గం. వారి కోసం టర్మ్ ఇన్సూరెన్స్‌తో పాటు ఆరోగ్య బీమా పాలసీ కూడా తీసుకోవాలి. ఎంత తక్కువ వయసులో తీసుకుంటే వారికి అంత ప్రయోజనం. దీనివల్ల భవిష్యత్తులో ఏమైనా అనారోగ్య సమస్యలు తలెత్తినా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటుంది. మరోవైపు పెరుగుతున్న వైద్య ఖర్చుల నేపథ్యంలో వారికి మంచి బహుమతి ఇచ్చినవారమవుతాం.

**ఓ మంచి ప్రణాళికను సిద్ధం చేయండి..**

అక్కాచెల్లెళ్లకు ఆర్థిక వ్యవహారాలపై పెద్దగా అవగాహన లేకపోతే వారికి ఓ నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించి ఇవ్వండి. ఆమె భవిష్యత్తు అవసరాలు, లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేయాలి. చదువు, ఉద్యోగం, మదుపు, పొదుపు, వివాహానంతర జీవితం... వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుని వారికి ఆర్థిక భరోసానిచ్చే చక్కటి ప్రణాళికను వారి చేతిలో పెట్టాలి.

**డిజిటల్ బంగారం బెటర్...**

రాఖీ పండగ సందర్భంగా కొంతమంది తమ సోదరీమణులకు బంగారాన్ని బహుమతిగా ఇస్తుంటారు. అయితే భౌతిక బంగారం కంటే పసిడి బాండ్లను కొనివ్వడం మేలు. ఇప్పుడు అవి అందుబాటులో లేకపోయినా.. ఆ సొమ్మును పక్కకు తీసి ప్రభుత్వం వాటిని విక్రయించినప్పుడు కొని గిఫ్ట్‌గా ఇవ్వండి. దీనివల్ల బంగారంతో పాటు ఏటా కొంత రాబడి కూడా అందించినవారవుతారు. భద్రత కరువైన ఈ తరుణంలో డిజిటల్ రూపంలో గోల్డ్ ఇవ్వడం మంచి ఆలోచన.

రక్షాబంధన్ వేడుకలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ముస్తాబైంది. తమ ప్రియమైన సోదరులకు రాఖీలు కట్టేందుకు ఇంటి ఆడపడుచులు సిద్ధమవుతున్నారు. అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగకు ప్రతి ఇల్లు ముస్తాబైంది. తమ సోదరులు జీవితాంతం తమకు రక్షగా ఉండాలని ఇవాళ వారి చేతికి అక్కాచెల్లెళ్లు రాఖీ కడతారు. మార్కెట్లో రకరకాల రాఖీల కొనుగోళ్లల్లో అక్కలు, చెల్లెళ్లు బిజీబిజీగా ఉన్నారు.



పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, యోగా ఈవెంట్ నిర్వహిస్తున్న చాగల్లు హైస్కూలు విద్యార్థినులు

# చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- చాగల్లు హైస్కూల్లో రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ ప్రారంభం

చాగల్లు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు హైస్కూల్లో రాష్ట్రస్థాయి జూనియర్ బాల, బాలికల మిక్స్‌డ్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కొవ్వూరులో నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యమివ్వాలన్నారు. శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు క్రీడా సామగ్రి కిట్లు అందజేయడానికి రూ.30వేలు చొప్పున కేటాయించామన్నారు. త్వరలోనే సామగ్రి కొనుగోలు చేసి పాఠశాలలకు ఇస్తామన్నారు. క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వం ఇచ్చే నగదు పారితోషికాన్ని పెంచినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో క్రీడల అభివృద్ధికి విప్లవాత్మకమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కడపలో స్పోర్ట్స్ స్కూలు అభివృద్ధికి రూ.40లక్షలు కేటాయించినట్టు చెప్పారు. రాష్ట్రంలో 110 క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తి, టీమ్ స్పిరిట్ కలిగి ఉండాలన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పదికి పైగా జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కరుటూరి సతీష్, ఎస్ఎంసీ చైర్మన్ కొఠారు గోపాలకృష్ణ, కూటమి నాయకులు తాళ్లూరి హరిశ్చంద్ర ప్రసాద్, ఈడుపుగంటి సుబ్బారావు, తాళ్లూరి వరప్రసాద్, మిరియాల సతీష్, వివిధ పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు, సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

# వారాహిదేవిగా వనదుర్గమ్మ

## అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం తరపున సారె సమర్పణ


వారాహిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న వనదుర్గ

అన్నవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మ అమ్మవారి శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా నాల్గోరోజైన శుక్రవారం వారాహిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేషపూజలు, కుంకుమార్చనలు, అర్చకస్వాములు నిర్వహించారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం తరపున అమ్మవారికి సారెను సమర్పించారు. ఈవో వీర్ల సుబ్బారావు, ఉద్యోగుల సంఘం నాయకులు గంటా విష్ణు, అనకాపల్లి ప్రసాద్, బాస్కర్, పోల్నాటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### ఘనంగా చండీహోమం

వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


వనదుర్గకు దేవస్థానం ఉద్యోగుల సంఘం తరపున సారె తీసుకెళ్తున్న ఉద్యోగులు

# ఆదివాసీల ఊపిరి ఆపేస్తారా?

- రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఆగని మరణాలు
- ప్రశ్నార్థకంగా గర్భిణుల ఆరోగ్యం
- అందుబాటులో ఉండని వైద్యులు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు
- ఆదివాసీ మహిళ మరణం
- కేసు స్వీకరించిన జాతీయ కమిషన్లు

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

ఆదివాసీల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం పడుతున్న తపనకు భిన్నంగా నడుస్తున్న రంపచోడవరం మన్యంలోని ప్రభుత్వ రంగ ఆసుపత్రులు ఆదివాసీల ఊపిరి తీస్తున్నాయి. రంపచోడవరంలోని ఏరియా ఆసుపత్రి అయితే మృత్యు కుహరంగా మారి ఇక్కడకు చేరడానికే ఆదివాసీ గర్భిణులు ఆందోళన చెందే దుస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో అందిన సేవలకు భిన్నంగా అన్ని ఆసుపత్రుల్లోనూ మెరుగైన వైద్య సేవలను అందించాలని ప్రభుత్వం భావించి అనేక వసతులను కల్పించినా ఆదివాసీల ప్రాణాలకు ఆసుపత్రుల్లో రక్షణ లేకుండా పోతోంది. కేవలం 8 నెలల్లో ఒక్క రంపచోడవరం ఏజెన్సీ డివిజన్ పరిధిలోని 7 మండలాల్లోని ఆదివాసీలు చవిచూసిన ఆసుపత్రి మరణాలు వెలుగులోకి వచ్చినవి కొన్నే అయితే వెలుగు చూడనివి ఎన్నో ఉన్నాయి. మన్యంలో ఉన్న ఆదివాసీల స్థితి గతులను దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్ స్థాయిలో అన్నిరకాల వైద్య సేవలకు అనుగుణంగా ఆసుపత్రులను తీర్చిదిద్దితే వైద్యులు విధులను విస్మరించి అవసరానికి అందుబాటులో లేకుండా పోవడంతో ప్రాణా పాయస్థితుల్లో మరణాలను నివారించగలిగే అవకాశాలను, మెరుగైన వైద్యం పొందే హక్కులను ఆదివాసీలు కోల్పోతున్నారు. ఒక్క రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొంది మరణించిన వారే ఈ సంవత్సరంలో పదివరకూ ఉంటాయని అనధికార అంచనా!



రంపచోడవరం ఏరియా ఆసుపత్రి

### చేతులు దులిపేసుకుని...

పండా సింధూరం అనే ఆదివాసీ మహిళ తన నాల్గో కాన్పు కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో 20 రోజుల పాటు చికిత్స తీసుకున్న అనంతరం బుధవారం ప్రసవానికి తీసుకువెళ్లిన సందర్భంలో బిడ్డ చేతులు బయటకు వచ్చాక ప్రాణాపాయ స్థితికి చేరుకోవడంతో అప్పటికపుడు రాజమండ్రికి తరలించి ఇక్కడి ఆసుపత్రి వైద్యులు చేతులు దులిపేసుకున్నారు. అయితే రాజమండ్రిలో ఆమె ప్రాణాలు కోల్పోగా, ఆమె కడుపులో ఉన్న బిడ్డను సిజేరియన్ చేసి తీసేందుకు ప్రయత్నించినా బిడ్డ ప్రాణాలు కూడా దక్కలేదు. వాస్తవానికి రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో సిజేరయన్ చేసేందుకు అవసరమైన అన్ని వసతులూ, సౌకర్యాలూ ఉన్నా సమయానికి సిజేరియన్ చేయకపోవడమే ఆదివాసీ మహిళ మరణానికి కారణమైంది. అంతకు కొద్దిరోజుల ముందు మరో మహిళను కూడా ఇదే పరిస్థితుల్లో రాజమండ్రికి తరలిస్తుంటే మార్గంమధ్యలో అంబులెన్సులోనే ప్రసవించింది. అంతకు ముందు వై.రామవరం మండలానికి చెందిన కాకూరి పార్వతి అనే మహిళ కూడా సహజ ప్రసవం సమయంలోనే మరణించింది. ఆమెకు కూడా సిజేరియన్ చేసే అవకాశం ఉన్నా కాపాడలేదు.

## వైద్యుల్లో నిర్లక్ష్యం...

ప్రతి ఘటనపైనా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకే కాకుండా మన్యానికి పెద్ద దిక్కుగా ఉన్న రంపచోడవరం ఐటీడీఏ ఉన్నతాధికారికి తెలిసినా ఇటువంటి ఘటనలను పునరావృతం కాకుండా చూడలేకపోతున్నారు. ఇక్కడి పరిస్థితిని లోతుగా చూస్తే అన్ని హంగులతో ప్రభుత్వం చర్యలు చేపట్టినా ఆసుపత్రిలో వైద్యులకు చిత్తశుద్ధి కొరవడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎందరో ఆదివాసీలు ఆర్థిక పరిస్థితులు బాగోలేక ప్రభుత్వం ఆదుకుంటుందని రంపచోడవరం ఏరియా ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. కానీ ఇక్కడ వైద్యం సులభంగా అందించడం లేదు.

### బాధితుల ఫిర్యాదులు

ప్రసవం కల్పించి, తల్లీబిడ్డలను సురక్షితంగా పంపించే సౌకర్యాలు ఉన్నా ఆ దిశగా పని చేయడంలో రంపచోడవరం ఆసుపత్రి విఫలమైంది. ఆదివాసీల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో సీరియస్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ ఇద్దరు ఐఏఎస్ అధికారులు, కీలక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో రంపచోడవరం కేంద్రంలో నడుస్తున్న నిర్లక్ష్య మరణాలు ఆగడం లేదు. ఆయా ఘటనలు జరిగినపుడు మొక్కుబడిగా వ్యవహరిస్తూ ఆయా వైద్యులను కాపాడే దిశగానే ఉన్నతాధికారుల చర్యలు ఉండటంతో బాధితులు నేరుగా జాతీయ హక్కుల, జాతీయ గిరిజన కమిషన్లను ఆశ్రయించి ఫిర్యాదులు చేస్తున్నారు. వై.రామవరం ఆదివాసీ మహిళ మరణంపై ఇప్పటికే జాతీయ హక్కుల కమిషన్, గిరిజన కమిషన్లు కేసు నమోదు చేసుకున్నాయి. ఆదివాసీ దినోత్సవ నేపథ్యంలోనైనా ముఖ్యమంత్రి మన్యం పర్యటనలో ఆదివాసీల ఆరోగ్యంపై సీరియస్‌గా స్పందించి ఆరోగ్య సేవలు అందేలా కృషి చేస్తారని ఆదివాసీ సమాజం ఎదురుచూస్తోంది.

### గర్భిణి మృతిపై విచారణ


సింధూరం (ఫైల్)

రంపచోడవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిండు గర్భిణి పండా సింధూరం, గర్భంలో ఉన్న బిడ్డ మృతిపై రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పాడేరు డీసీహెచ్ వీరవేణి శుక్రవారం విచారణ ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, డాక్టర్లు, సిబ్బందిని విచారించారు. ఈ విచారణ నివేదికను సెకండరీ హెల్త్ డైరక్టర్‌కు అందించనున్నట్టు ఆమె తెలిపారు.

# సరుకు దొరికింది... సంగతి తేలాలి!

- పిఠాపురంలో చోరీ అయిన సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ల స్టాకు స్వాధీనం
- సరుకు తరలించిన వాహనాల సీజ్
- ఐదుగురి పాత్ర ఉన్నట్టు గుర్తింపు
- వారి గత చరిత్రపై విచారణ


స్వాధీనం చేసుకున్న ప్యాకెట్లను వాహనాల్లోకి ఎక్కిస్తున్న దృశ్యం

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ ప్యాకెట్ల లోడు లారీ చోరీ కేసులో ఐదుగురు వ్యక్తుల పాత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే లారీ దొరకగా, వివిధ ప్రాంతాలకు తరలించిన సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ల స్టాకుతో పాటు, అందుకు వినియోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న పోలీసులు వారి గత చరిత్రపై దృష్టి పెట్టారు. వారికి గల రాజకీయ సంబంధాలపై ఆరా తీస్తున్నారు.

### అసలేం జరిగిందంటే...

కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆయిల్‌ప్యాకెట్లు లోడుతో ఉన్న లారీ 2 రోజుల క్రితం చోరీ కావడం సంచలనం కలిగించింది. కాకినాడలోని జెమిని ఆయిల్ ఫ్యాక్టరీ నుంచి రూ.28లక్షలు విలువైన సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు లోడుతో ఉన్న లారీని పిఠాపురం తీసుకువచ్చి ఈనెల 5న రాత్రి పార్కు చేయగా దానిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సరుకుతో సహ లారీ మాయమైన విషయాన్ని బుధవారం ఉదయం గుర్తించిన లారీ ఓనర్ కమ్ డ్రైవర్ దగ్గు అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 6న ఉదయం 11గంటల సమయంలో ఖాళీ లారీని తుని సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద గుర్తించారు. అందులో సరుకు లేకపోవడంతో సరుకు ఎక్కడ డంప్ చేశారనే విషయంలో పోలీసులు విచారణ చేపట్టారు. గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు, అక్కడ ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వచ్చి టోల్‌ఫీ చెల్లించడం తదితర విషయాలను గుర్తించి విచారణ సాగించగా సరుకు ఎక్కడెక్కడ దింపారో వెల్లడైంది. కత్తిపూడి శివారు, మండపం సమీపంలో మామిడితోటల్లో బొలెరో, టాటా మేజిక్ వాహనాలు, ట్రాక్టర్ల ద్వారా సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లను తరలించి నిల్వ చేసినట్టు గుర్తించారు. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా మరికొంత సరుకు దొరకాల్సి ఉంది. ఈ సంఘటనలో పిఠాపురం పట్టణానికి చెందిన ఇద్దరు, పండూరుకు చెందిన ఒకరు, మండపం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల పాత్ర ఉన్నట్టు ఇప్పటి వరకూ గుర్తించారు. వారిలో కొందరు ఒక రాజకీయ పార్టీ కోసం పనిచేయడమే లారీ యూనియన్ పదవుల కోసం ప్రయత్నించినట్టు చెబుతున్నారు. వీరు ఈ ఒక్క లారీ చోరీకే పాల్పడ్డారా, 3 రోజుల క్రితం జరిగిన నూకల లోడు లారీ చోరీ సంఘటన, అంతకు ముందు జరిగిన గుట్కా ప్యాకెట్లు వాహనం చోరీ తదితర సంఘటనలతో సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. వారి గత చరిత్రపై ఆరా తీస్తున్నారు. లారీని చోరీ చేసిన తర్వాత కొందరు వ్యక్తులు కారులో అనుసరించినట్టు సమాచారం. ఈ వాహనం ఎవరిది, కారులో ఎవరెవరు ఉన్నారు తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

**ఆంధ్రజ్యోతి కథనంతో...**

సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడు లారీయే గాక గత ఆదివారం రాత్రి నూకలలోడు లారీ చోరీకి గురైందని, జీపీఎస్ ఉండడంతో రౌతులపూడి మండలం గిడజాం వద్ద దానిని గుర్తించారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై పోలీసులు ఇప్పుడు దృష్టిసారించారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోవడంతో సదరు లారీ యజమాని వద్ద ఫిర్యాదు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. లారీ ఎలా చోరీకి గురైందో ఆరా తీస్తున్నారు.

### నాలుగు దర్యాప్తు బృందాల ఏర్పాటు

లారీ చోరీ సంఘటనపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 4 దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసినట్టు పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. లారీతో పాటు మాయమైన సరుకును గుర్తించామని తెలిపారు. కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు ఆయన చెప్పారు.

# యానాంలో యువకుడి అనుమానాస్పద మృతి


మరణించిన గురుమూర్తి

యానాం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యానాంలోని ఓ లాడ్జిలో గురువారం అర్ధరాత్రి యువకుడు అనుమనాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం కేశనకుర్రుకు చెందిన చింతా గురుమూర్తి(21) ముగ్గురు స్నేహితులతో యానాం రాజీవ్‌బీచ్‌లోని సూర్యలాడ్జిలో దిగారు. వారు సాయంత్రం నుంచి మద్యం తాగుతున్నారు. మొదటి అంతస్తులోని గదిలో సహచార మిత్రులు పడుకోగా ఫోన్ మాట్లాడడానికి వచ్చిన గురుమూర్తి అనుమానాస్పదస్థితిలో కిటికీ పక్కనే ఉన్న కరెంటు తీగలపై పడిపోయి మృతిచెందాడు. అటుగా వెళ్తున్న కొందరు చూసి లాడ్జి ప్రతినిధుకు చెప్పడంతో వారు పోలీసులుకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపకశాఖ ఉద్యోగులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. గురుమూర్తి ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి త్రిమూర్తులు కూలీ పనిచేస్తుండగా, చెల్లి దివ్యాంగురాలు.

# మెట్ల పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

అల్లవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బెండమూరిలంక గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ ముత్యాల వీరన్నబాబు(47) బిల్డింగ్ మెట్ల పై నుంచి జారి పడి మృతి చెందాడు. శుక్రవారం బెండమూరిలంకలో యాళ్ల వెంకటరామోహనరావు బిల్డింగ్ పనులకు వచ్చిన వీరన్నబాబు మెట్ల పై నుంచి జారి పడి తీవ్ర గాయాలతో అపాస్మకర స్థితికి చేరుకున్నాడు. అమలాపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అతడి కుమారుడు సాయిపవన్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు.

# వ్యక్తి అదృశ్యంపై కేసు

కె.గంగవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలో భట్లపాలిక శివారు చర్లంపూడికి చెందిన మేడిశెట్టి దుర్గారావు(40) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పామర్రు ఇన్‌చార్జి ఎస్‌ఐ భుజంగరావు తెలిపారు. దుర్గారావు గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దుర్గారావు సోదరుడు మేడిశెట్టి వాడపల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

# వ్యక్తిని గాయపర్చిన ముగ్గురిపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం బంగారంపేటకు చెందిన కర్రి నవీన్‌కుమార్, అతడి పిన్ని సువర్ణరత్నం ఇంటిముందు వేసిన కంకర విషయంలో ఘర్షణపడ్డారు. దీంతో సువర్ణరత్నం బంధువులు శేఖర్, సురేష్, కిరణ్ నవీన్ ఇంట్లోకి వచ్చి తలపై కొట్టి గాయపర్చారు. చంపుతామని బెదిరించడంతో కొవ్వూరు పోలీసులకు నవీన్ ఫిర్యాదు చేశాడు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి పేర్కొన్నారు.

# గంజాయితో నలుగురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మండపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని మారేడుబాక పంచాయతీ పరిధిలోగల సాయినగర్‌లో గంజాయితో నలుగురిని పట్టుకున్నామని పట్టణ ఎస్‌ఐ రాము తెలిపారు. గురువారం రాత్రి సాయినగర్‌లో యవత గంజాయి సేవిస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. మారేడుబాకకు చెందిన ఇద్దరు యువకులు, అనపర్తికి చెందిన యువకుడు, మండపేట పట్టణానికి చెందిన 17 ఏళ్ల బాలికను అదుపులోకి తీసుకుని వారి నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ఆలమూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌విధించారని ఎస్‌ఐ తెలిపారు.

# గోదావరిలో దూకి వృద్ధుడి మృతి


మృతిచెందిన విశ్వేశ్వరరావు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో దూకి వృద్ధుడు మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామానికి చెందిన తాటి విశ్వేశ్వరరావు (65) పెళ్లి సంబంధాలు కుదుర్చుతుంటాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మద్దూరులంక- బొబ్బర్లంక మధ్య బ్యారేజ్ వంతెన పై నుంచి గోదావరిలో దూకేశాడు. అక్కడ ఉన్న జాలర్లు పడవల సాయంతో విశ్వేశ్వరరావును గుర్తించి బయటకు తీసుకువచ్చారు. అప్పటికే విశ్వేశ్వరరావు మృతిచెందాడు.

### మహిళ గల్లంతు..

రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకిన మహిళ గల్లంతైంది. కొవ్వూరు పట్టణ పోలీసులు, స్థానికులు అందించిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి సుమారు 30 వయస్సు కలిగిన మహిళ ఆటోలో కొవ్వూరు బయలుదేరింది. బ్రిడ్జిపై 151వ స్తంభం వద్ద ఆటో ఆపమని ఒక్కసారిగా వంతెనపై నుంచి గోదావరిలో దూకేసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు బోటులో నదిలో గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలియరాలేదు. దీనిపై కేసు నమోదు కావలిసి ఉంది.

# గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని కొవ్వూరు పట్టణ పోలీసులు గుర్తించారు. వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని ఏపీ టూరిజం బోటు పాయింటు వద్ద 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉండే వ్యక్తి మృతదేహం కనిపిండంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక జాలర్ల సహాయంతో నది నుంచి బయటకు తీయించారు. మృతదేహం డీకంపోజ్ కావడంతో గుర్తుపట్టడానికి వీలులేకుండా తయారై మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. వీఆర్వో విప్పర్తి మంగాయమ్మ అందించిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ జి.శ్రీనివాస్ తెలిపారు.

# రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని మృతదేహం


మాధవపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని మాధవపురం రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలు పక్కన ఉన్న మృతదేహాన్ని తుని రైల్వే పోలీసులు గుర్తించారు. విశాఖపట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న రైలు నుంచి జారిపడి 40-50 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్టు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని తెలిపారు. ఎరుపు రంగు నెక్ టీషర్టు, కాకి నిక్కరు మృతదేహంపై ఉన్నాయని చెప్పారు. మృతదేహం కొంతభాగం ఎముకల గూడుగా ఉందని, దీనితో సంఘటన పది రోజుల క్రితం జరిగినట్టు భావిస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ప్రభుత్వాసుపత్రి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ప్రభుత్వ రైల్వే ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

# ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రధాన అర్చకుడు ఫణికుమార్ శివైక్యం


కళ్లేపల్లి ఫణికుమార్ (ఫైల్)

ద్రాక్షారామ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ భీమేశ్వరాలయ అనువంశిక అర్చకుడు, ప్రధాన అర్చకుడు కళ్లేపల్లి ఫణికుమార్ (83) శుక్రవారం శివైక్యం చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఫణికుమార్ సుదీర్ఘకాలం భీమేశ్వరాలయ అర్చకుడిగా సేవలందించారు. ఏపీ అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా ఫణికుమార్ అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన మృతికి సంతాపంగా భీమేశ్వరాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మూసివేశారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చక, వేదపండిత బృందం, ఆలయ సిబ్బంది, రామచంద్రపురం డివిజన్ ఆలయాల సిబ్బంది, ఏపీ పురోహిత బ్రహ్మణ సమాఖ్య బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి గణేష్‌శర్మ తదితరులు సంతాపం తెలిపారు.

# డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయపడినవారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొవ్వూరు పట్టణానికి చెందిన కల్లూరి పైడిరాజు, బడే సత్యవతి బైక్‌పై దేవరపల్లి నుంచి కొవ్వూరు బయలుదేరారు. కాపవరం ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్ మధ్యలో డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో బైక్ పై నుంచి ఇద్దరు కింద పడిపోయారు. తల, చేతులు,కాళ్లకు గాయలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ముమ్మిడివరంలో అగ్నిప్రమాదం

## రూ.3 లక్షల ఆస్తినష్టం


ప్రమాదంలో కాలి బూడిదైన సర్టిఫికెట్లు





ముమ్మిడివరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ చింతలమెరకలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక డాబా దగ్ధమై రూ. 3 లక్షల ఆస్తినష్టం సంభవించింది. శుక్రవారం తెల్లవారుజామున మట్టపర్తి ప్రసాద్ (చిన్నబాల)కు చెందిన ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీక్ అవ్వడంతో మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం జరిగింది. బంగారపు ఆభరణాలు విలువైన దస్తావేజులు, పిల్లల స్కూల్ సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ముమ్మిడివరం అగ్ని మాపక ఇన్‌చార్జి అధికారి ఎం.బాలరాం ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

# మేఘం మురిసెను..



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై అందంగా కనిపించింది. ఈ దృశ్యం చూపరులను కట్టిపడేసింది.

- ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

# ప్రజలతో మమేకమై పనిచేయాలి

**కలెక్టర్ ప్రశాంతి.. 49వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీపై క్షేత్రస్థాయి పరిశీలన**



49వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ప్రతి నెలా 1వ తేదీన అర్హత కల్గిన లబ్ధిదారులకు వారి నివాసాల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని 49వ డివిజన్‌లో కలెక్టర్ పర్యటించారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియపై పంపిణీ అధికారులు, లబ్ధిదారులు, ప్రజలతోను మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల సచివాలయ సిబ్బంది బదిలీల నేపథ్యంలో కొత్త ప్రదేశాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది స్థానిక ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. వారిని అర్థం చేసుకోవడంతోపాటు సేవలందించడంలో తగిన ప్రాధాన్యత చూపాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలువురు తమకు పింఛన్లు రాలేదని, తల్లికి వందనం డబ్బులు పడలేదని, రేషన్‌కార్డులు కావాలని, ఇంటి స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై కలెక్టర్ స్పందిస్తూ ఆయా ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి వాటి యథార్థస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ అధికారి శైలజావల్లి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుల ల్యాబ్ ఆన్ వీల్స్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలంలోని ఏపీటీడబ్ల్యుఆర్ స్కూల్ గరల్స్ పాఠశాలను సందర్శించింది. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల గణిత విభాగాధిపతి జి.చంద్రశేఖర్, గణిత అధ్యాపకులు, పీజీ విద్యార్థులు పాల్గొని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గణిత శాస్త్రంలో మెలకువలు నేర్పించారు. జామితి, చతుర్భుజాలను అవగాహన చేసుకోవడం, త్రిభుజాలు, వాటి ధర్మాలు తదితర అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**వక్తృత్వ పోటీలు...** ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రఫుల్ల చంద్రరాయ్ జన్మదిన వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, ఎం.పద్మజ మాట్లాడారు. ఎం.శాంతకుమారి సమన్వయకర్తగా వ్యవహరించారు.

## బూరుగుపూడి సొసైటీ చైర్మన్‌గా కేశవరావు

కోరుకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా బూరుగుపూడికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మండల రైతు సంఘం నాయకుడు కంటే నాగ కేశవరావు, సభ్యులుగా బాలిన వెంకటేష్, యర్రంశెట్టి సూర్యనారాయణ నియమితులయ్యారు. బూరుగుపూడి పీఏసీఎస్‌లో బూరుగుపూడి, గుమ్ములూరు రైతులు సభ్యులుగా ఉన్నారు. కేశవరావు గతంలో 3సార్లు సొసైటీ అధ్యక్షుడిగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. తన నియామకం పట్ల ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరిలకు ధన్యవాదాలు తెలిపారు.

## నాగేంద్రకిషోర్‌కు నన్నయ వీసీ సత్కారం



నాగేంద్ర కిషోర్‌ను సత్కరిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అమెరికన్ సైకాలాజికల్ అసోసియేషన్ (ఏపీఏ)-2025 అంతర్జాతీయ సదస్సులో ఆన్‌లైన్ ద్వారా పాల్గొంటున్న స్పోర్ట్స్ అండ్ కమ్యూనిటీ సైకాలజిస్ట్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ స్పృహ సైకాలజీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సుంకర నాగేంద్రకిషోర్‌ను వర్శిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్న అభినందించి సత్కరించారు. సదస్సులో విషయ పరిజ్ఞానం పెంపుదలతోపాటు యువత మానసిక ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా వీసీ సూచించారు. సెమినార్లు, వర్క్‌షాపులు తదితర విద్యాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు సహకారాలు అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

### అన్నదాన సత్రం ధర్మకర్తల మండలి

## నూతన కార్యవర్గానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయశాఖ అధీనంలోని రాజానగరంలోని శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ అన్నదాన సత్రం (ఫీడింగ్)నకు నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సత్రం ఈవో డి.సురేష్‌బాబు కోరారు. దేవదాయశాఖ ఉత్తర్వులను అనుసరించి ఆసక్తి ఉన్నవారు నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి 20 రోజుల లోపు దరఖాస్తు (ఫారం-2)ను జిల్లా దేవదాయశాఖాధికారి రాజమహేంద్రవరం వారికి సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలను సత్రం కార్యనిర్వహణాధికారి 94403 26258 నెంబరును సంప్రదించవచ్చన్నారు.

## గోకవరం తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా పండు



గోకవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ అనుబంధ కమిటీల నియామకంలో భాగంగా గోకవరం మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా ఏలేటి పండుబాబు (పండు) నియమితులయ్యారు. జగ్గంపేటలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రకటించారు. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన పండు టీడీపీ సీనియర్ నాయకుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన నియామకం పట్ల ఎమ్మెల్యే నెహ్రూ, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పండును పలువురు అభినందించారు.

## కారుణ్య నియామకపత్రాన్ని అందించిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని సీజేఆర్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తూ మరణించిన మందాలపు నాగలక్ష్మి ఉద్యోగాన్ని కారుణ్య నియామకంలో ఆమె భర్త నాగబాబుకు ఇచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం నియామక పత్రాన్ని పి.నాగబాబుకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగబాబుకి జూనియర్ అసిస్టెంట్‌గా కారుణ్య నియామక పత్రాన్ని ఇచ్చినట్టు పేర్కొన్నారు. క్రమశిక్షణతో పనిచేయాలని ఆయనకు సూచించారు. కార్యక్రమంలో మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో కార్మికులకు చేసింది శూన్యం

**టీఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాళ్ల శ్రీనివాసరావు**

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో కార్మికులు అన్యాయం జరిగితే ఆ పార్టీలో ఉన్న బొజ్జ రామకృష్ణ అప్పుడేమీ మాట్లాడకుండా ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును విమర్శిస్తున్నాడని టీఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాళ్ల శ్రీనివాసరావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడినని చెప్పుకుంటున్న బొజ్జ రామకృష్ణ అసలు ఎలక్ట్రికల్ పని నేర్చుకున్న కార్మికుడే కాదన్నారు. జగన్ పాలనలో భవన నిర్మాణ కార్మికులకు పనిలేక పస్తులుంటే, వేలాది మంది కార్మికులు కల్తీ మద్యం తాగి మరణిస్తే అప్పుడు ఏ రోజు కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం గుర్తుకు రాలేదని ఇప్పుడు కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుంటే చూసి తట్టుకోలేక ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదన్నారు. తమ కార్మిక శాఖ మంత్రి సుభాష్ కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపడుతున్నారని, కూటమి ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కట్టుబడి వుందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడిన సంఘటన కాపవరంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కొవ్వూరు పట్టణానికి చెందిన కల్లూరి పైడిరాజు, బడే సత్యవతి బైక్‌పై దేవరపల్లి నుంచి కొవ్వూరు బయలుదేరారు. కాపవరం ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ మధ్యలో డివైడర్‌ను ఢీ కొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ కింద పడిపోయారు. తల, చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# నామినేటెడ్ జోష్

- రాజమహేంద్రవరంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు పదవులు
- మొన్న పలు కార్పొరేషన్లకు..
- తాజాగా ఎండోమెంట్ కమిటీలకు చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యులుగా నియామకాలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు జరిగి పద్నాలుగు నెలలు గడిచాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎదురుదెబ్బలు తిని నిలబడిన పార్టీ జెండాలు మోసిన నాయకులకు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఒక్కొక్కటిగా దక్కుతున్నాయి. రాజమహేంద్రవరానికి చెందిన అనేక మంది నాయకులకు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో ముఖ్యమైన పదవులు దక్కుతున్నాయి. పదవులు కేటాయింపులో మిత్ర ధర్మాన్ని పాటిస్తూ ముందుగు సాగుతున్నారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు పదవులు లభించాయి.

**రాష్ట్ర స్థాయి పదవులు..**

శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా కుడిపూడి సత్తిబాబు(టీడీపీ), టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా గంటా స్వరూప(జనసేన), క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా మంతెన సత్యనారాయణ రాజు(టీడీపీ)లకు అవకాశం లభించింది.

తాజాగా రాజమహేంద్రవరంలో ఎండోమెంట్ కమిటీలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రతిపాదించగా కొంతమంది నాయకులను ఆయా బోర్డుల్లో చైర్మన్లు, డైరెక్టర్లుగా ప్రభుత్వం నియమించింది.

**ఏండోమెంట్ కమిటీల్లో..**

రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలో 14 ఎండోమెంట్ కమిటీలకు అభ్యర్థుల పేర్లను ఎమ్మెల్యే వాసు ప్రతిపాదించగా వాటిలో నాలుగు కమిటీలకు ప్రభుత్వం ఆయోదం తెలిపింది. మరో నాలుగింటికి కూడా పేర్లు దాదాపు ఖరారయ్యాయి.ఇందులో జాంపేట ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్‌గా దాసరి గురునాధరావు(జనసేన), సారంగధరేశ్వరాలయం కమిటీ చైర్మన్‌గా కేవీడీఎస్‌సీవీ చౌదరి(టీడీపీ), కోరుకొండ రోడ్డు శ్రీవల్లి సుబ్రహ్మణేశ్వరాలయ కమిటీ చైర్మన్‌గా యేడిద వీర వెంకట దుర్గాప్రసాద్(జనసేన),గోదావరి బండ్ రోడ్డు నాళం భీమరాజు వీధిలోని విఘ్నేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా మద్ది వెంకట నాగపూర్ణ శ్రీ సత్యనారాయణరావు(టీడీపీ), నేషనల్ సీనియర్ బేసిక్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా చింతా జోగినాయుడు(టీడీపీ)ని ఎంపిక చేశారు. అలాగే పందిరి మహదేవుడు సత్రం చైర్మన్‌గా రెడ్డి మణేశ్వరరావు(టీడీపీ), గోదావరి బండ్ ఉమామార్కండేయ స్వామి దేవస్థానం చైర్మన్‌గా మదన్ సింగ్‌రాజ్ పురోహిత్(టీడీపీ), శ్రామలాంబ దేవస్థానం చైర్మన్‌గా కడియాల వీరభద్రరావులను ప్రతిపాదించారు.ఇంకా వేణుగోపాలస్వామి దేవస్థానం సహా ఆరు కమిటీలను నియమించాల్సి వుంది. అందులో బీజేపీకి ప్రాధాన్యత వుండే అవకాశం ఉంది.

**పక్కా ప్రణాళికతో..**

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా టీడీపీ ట్రేడ్ విభాగం నేత తవ్వా రాజును, ఆర్యాపురం బ్యాంకు ఎన్నికల్లో చైర్మన్‌గా చల్లా శంకర్రావు ప్యానల్‌ను, జాంపేట కోపరేటివ్ బ్యాంకు ప్యానల్‌ను గెలిపించుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తన నియోజకవర్గంలో కూటమి నేతలకు పదవులను అప్పగించేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. తాజా ఎండోమెంట్ కమిటీల్లో 140 మందికి అవకాశం కల్పించారు. ఇంకా నగరంలో ప్రతిష్టాత్మక హితకారిణి సమాజం ట్రస్ట్, గౌతమి జీవకారుణ్య సంఘం కమిటీలను నియమించాల్సివుంది.మరో ఏడు నెలల్లో కార్పొరేషన్ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున పక్కా ప్రణాళికతో ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారు.



రాజమహేంద్రవరం ఆర్యాపురం కోఆపరేటివ్ పాలక మండలితో ఎమ్మెల్యే వాసు(ఫైల్)

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

- అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు
- ముత్తైదువులకు వాయినాలు



అనపర్తిలో మహాలక్ష్మమ్మను దర్శించుకుంటున్న మహిళలు

కోరుకొండ/రంగంపేట/బిక్కవోలు/సీతానగరం/అనపర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం కావడంతో గ్రామాల్లో మహిళలు ఇళ్ల వద్ద భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలను ఆచరించారు. కొందరు ఉదయం వరలక్ష్మి వ్రతాలు చేయగా మరి కొందరు వరలక్ష్మి వ్రత కథలో చెప్పిన విధంగా సాయంత్రం వరకు ఉపవాసం ఉండి ప్రసాదాలు స్వీకరించి పూజలు చేశారు. 9 రకాల పిండి వంటలు, 9రకాల పండ్లు, 9 రకాల పుష్పాలతో బంగారు వరలక్ష్మి రూపులకు పూజలు చేశారు. ముందుగా విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, మండపారాధన వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ముత్తైదువులకు వాయినాలు దానం ఇచ్చారు. ఇదిలా ఉండగా వరలక్ష్మి వ్రతం సందర్భంగా కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. గాదరాడ ఓం శివశక్తి పీఠంలో అమ్మవారి ఆలయాలు వద్ద భక్తుల సందడి కనిపించింది. రంగంపేటలో దుర్గాదేవి, లక్ష్మీదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పరస్పరం వాయినాలు ఇచ్చుకొని, ముత్తైదువుల ఆశీస్సులు పొందారు. పాతదొడ్డిగుంట శ్రీమహాలక్ష్మీదేవి ఆలయంలో ఏకాహ భజనలు చేశారు. నల్లమిల్లిలో శ్రీలలితా దేవి ఆలయం, వడిశలేరులో దుర్గాదేవి ఆలయంలో సహస్ర నామాలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతిదేవి, వంతెన వద్ద ఉన్న కనక దుర్గమ్మను, జువ్వలదొడ్డిలోని సత్తెమ్మ తల్లిని గ్రామ క్షేత్రపాలకులుగా ఉన్న లక్ష్మీనారాయణులను దర్శించుకుని విశేష పూజలు జరిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణులను ప్రత్యేకంగా అలంకరించారు.ఆలయాల ఈవో ఆకెళ్ల భాస్కర్ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా దర్శనాలు కల్పించారు. సీతానగరం మండలం సింగవరంలో కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనపర్తిలోని దేవీచౌక్ వద్ద దుర్గమ్మ తల్లిని, శాంతిపురంలో మహాలక్ష్మమ్మను దర్శించుకునేందుకు మహిళలు బారులు తీరారు. మహాలక్ష్మమ్మ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



బిక్కవోలులో అలంకార రూపంలో లక్ష్మీనారాయణులు



రంగంపేటలో వాయినాలు తీసుకుంటున్న ముత్తైదువులు

## బీజేపీ దిష్టిబొమ్మ దహనం

నిడదవోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ఎలక్షన్ కమిషన్ కుమ్మక్కయి రాజ్యాంగాన్ని అవమానపరచి అప్రజా స్వామికంగా అధికారంలోకి వచ్చారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేడ వరపు భద్రందొర అన్నారు. శుక్రవారం పట్టణంలోని సంత మార్కెట్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, అగర్వాల హీరాలాల్, భావన రమేష్, బుద్దన లక్ష్మణరావు, నాగూర్, కాకి కిషోర్, అన్వర్ ఖాన్, గుర్రంరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

నల్లజర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కవులూరుకి చెందిన బండి శారదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆమెకు ఉన్న 10 సంవత్సరాల కుమారుడికి 25 కేజీల బియ్యం, రూ. నాలుగు వేల నగదును గ్రామానికి చెందిన యంగ్ విజన్ యూత్ సభ్యులు శుక్రవారం అందించారు.

## ఇనుపగొట్టాలు చోరీ

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఫైర్ వర్క్స్ సెంటర్‌లో ఇనుపగొట్టాలు దొంగిలించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. చాగల్లుకి చెందిన ఫయిజుల్లా బేగ్ పంగిడి గ్రామశివారులో ఫైర్ వర్క్స్ సెంటర్ నడుపుతున్నాడు. ఈనెల 5న షెడ్డు నిర్మాణానికి తెచ్చిన ఇనుప రేకులు, 12 గొట్టాలు ఎవరో దొంగిలించుకుపోయారని ఆయన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పరిశీలన



చక్రద్వారబంధం-వెలుగుబంద కూడలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సోము

రాజానగరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎదురుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి సంబంధిత అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఇటీవల మండలంలోని చక్రద్వారబంధం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు గ్రామస్థులు చేసిన విజ్ఞప్తి మేరకు నాలుగు రోజుల కిందట ఎమ్మెల్సీ సోము వీర్రాజు విజయవాడలో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతో చర్చలు జరిపారు. ఈ విషయమై ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి సంబంధిత అధికారులు హైవేపై నన్నయ వర్శిటీ సమీపంలోనూ, వెలుగుబంద కూడలి ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ చక్రద్వారబంధం, వెలుగుబంద సహా సుమారు 15 గ్రామాల ప్రజలతో పాటు అనేక మంది విద్యార్థులు నిత్యం రాజమహేంద్రవరం వెళ్లి వస్తుంటారని, ఈ సమయంలో హైవే డివైడర్‌ను దాటి ఆయా గ్రామాలకు వెళ్లి రావడం ప్రాణ సంకటంగా పరిణమిస్తోందన్నారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించినట్టు సోము పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఆళ్ల శివ నాగరాజుతో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోరుకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కోరుకొండలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో మిమ్మిడివరపు నరసింహమూర్తి కుటుంబం కట్టుబట్టలతో వీధిన పడ్డారు. నరసింహమూర్తి గ్రామంలో ఒక షాపు అద్దెకు తీసుకుని సప్లయ్ సామాను, టిఫిన్ హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి సప్లయ్ సామాను, హోటల్ సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో వారికి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సెక్రటరీ, రాజమండ్రి రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్ ప్రెసిడెంట్ మండలి వెంకన్నబాబు నగదు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బత్తుల సత్తిబాబు, ఈన్నమూరి రాంబాబు, కంకటాల మూర్తి, గ్రంధి రాజా, కటకం చలం గారు, చందు పాల్గొన్నారు.

## అన్ని అనుమతులతో ఆలయ విగ్రహ ప్రతిష్ఠ

**ఎమ్మెల్యే నల్లమిల్లి**



కొత్తూరులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అనపర్తి శివారు కొత్తూరులో నిలిచిన శివ పార్వతి, లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠ ఇక్కడి ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కొత్తూరు కాలనీలో అనుమతులు లేని స్థలంలో గుడి నిర్మాణం చేపట్టడంతో అధికారులు విగ్రహ ప్రతిష్ఠను నిలుపుదల చేసిన ఆలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీకి చెందిన పట్టా భూమిలో అనుమతి లేకుండా ఆలయం నిర్మించడం గత పాలకులు ప్రైవేటు స్థలాల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులపై విగ్రహ ప్రతిష్ఠ నిలిచిందని, పూర్తిస్థాయి అనుమతులతో త్వరలోనే ప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చంపుతానని బెదిరించినవారిపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చంపుతానని బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.బంగారంపేటకు చెందిన కర్రి నవీన్‌కుమార్, అతని పిన్ని సువర్ణరత్నం కు ఇంటిముందు వేసిన కంకర విషయంలో మూడురోజుల క్రితం ఘర్షణ జరిగింది. దీంతో సువర్ణరత్నం బంధువులు శేఖర్, సురేష్, కిరణ్ నవీన్ ఇంటిలోకి వచ్చి తలపై కొట్టి గాయపర్చడంతో పాటు చంపుతానని బెదిరించడంతో పోలీసులకు నవీన్ ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

## ఆయుష్మాన్‌తో నాణ్యమైన ఆరోగ్య సేవలు



చినకొండేపూడి -2 ఆరోగ్య మందిర్‌లో తనిఖీ చేస్తున్న నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీం

సీతానగరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకే ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేసినట్టు నేషనల్ క్వాలిటీ అష్యురెన్స్ స్టాండర్డ్స్ టీమ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ కె.నీవన తెలిపారు. శుక్రవారం చినకొండేపూడి-2 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నేషనల్ క్వాలిటీ అష్యురెన్స్ స్టాండర్డ్స్ టీమ్ ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు అవసరమైన పరికరాలు, వాటి నిర్వహణ తదితర అంశాల గురించి వర్చువల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పర్యవేక్షణాధికారి డాక్టర్ నవీన మాట్లాడుతూ ఈ ఆరోగ్య మందిరాల ద్వారా 14 రకాల టెస్టులు, 105 రకాల మందులు ఇక్కడ ఉచితంగా అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఏవీకె చైతన్య, డాక్టర్ ఎం.శైలజ రాణి, టీమ్ మెంబర్ డాక్టర్ ఎస్.సుధాలత ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కర్రతో కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చుని ఇరువురు ఘర్షపడిన సంఘటన కొవ్వూరు పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఆరికిరేవులకి చెందిన మట్టా అంజనేయులు యూరియా కోసం శ్రీరామ పీఏసీఎస్‌కు వచ్చి క్యూలైన్‌లో నిలబడ్డాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మల్లిపూడి నాగరాజు వచ్చి క్యూలైన్‌లో నిలబడకుండా ముందుకు వెళ్లిపోవడంతో ఆంజనేయులు క్యూలైన్‌లో నిల బడమని అడగడంతో ఇరువురి మధ్య తగాదా జరిగింది. ఈ ఘటనలో నాగరాజు ఆంజనేయులును కర్రతో కొట్టి గాయపర్చాడు. ప్రస్తుతం ఆంజనేయులును చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసునమోదు చేసినట్టు మహిళా హెచ్‌సీ లలిత తెలిపారు.

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 9 ఆగస్టు 2025 | 5


## వరాలివ్వమ్మా.. వరలక్ష్మి



దేవిచౌక్‌లో రాజరాజేశ్వరి

రాజమండ్రిలో భక్తుల క్యూ

వరలక్ష్మీ వ్రతంలో బత్తుల వెంకటలక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం వరలక్ష్మీవ్రతం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శుక్రవారం వేకువ జామునే పెద్ద ఎత్తున గోదావరి స్నానాలు చేశారు. భక్తులు తమ తమ ఇళ్లకు మామిడాకుల తోరణాలు, చామంతి పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించుకున్నారు. ఎవరింట్లో వారు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించు కున్నారు. కలశస్థాపన చేసి బంగారులక్ష్మీదేవి రూపును ఉంచారు. పండ్లు, పువ్వులు, దూపదీప నైవేద్యాలు సమర్పించారు. వరలక్ష్మీ పూజను కుటుంబ సమేతంగా నిర్వహించుకుని ముత్తయిదువులకు తాంబులాలు ఇచ్చి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఉపవాసం ఉండి సాయంత్రం రాజమహేంద్రవరంలోని దేవిచౌక్ బాలత్రిపుర సుందరీదేవి, వెంకటేశ్వనగర్‌లో మహాలక్ష్మి, వరలక్ష్మి, శ్యామలాంబ, నిడదవోలు కోటసత్తెమ్మ,ఉండ్రాజవరం పాలంగి ముత్యాలమ్మ తది తర అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి దర్శించుకున్నారు.

## లక్ష్మీ..వైభవం!

### రూ.30 లక్షలతో అలంకరణ

కడియం,ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. కడియపులంక పుంతలో మునలమ్మ అమ్మవారిని శ్రావణమాసం, వరలక్ష్మీవ్రతం, శుక్రవారం సందర్భంగా కరెన్సీనోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు. సుమారు రూ. 30 లక్షలు అమ్మవారి అలంకరణకు ఉపయోగించినట్టు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.



# ఇస్తారా.. ఎలాగని!

నాడంతా ఇష్టారాజ్యంగా



## సీనరేజి కాంట్రాక్టుకు ముమ్మర పైరవీలు

- సీనరేజీ కాంట్రాక్టుపై అయోమయం
- గత నెల 13న ముగిసిన గడువు
- తప్పుకున్న సుధాకర్ ఇన్‌ఫ్రా
- తిరిగి టెండర్ల ద్వారా కొత్త కంపెనీ
- మళ్లీ చాన్స్‌కు పాత కంపెనీ పావులు
- కాంట్రాక్టు పొడిగించేలా పైరవీలు
- గత వైసీపీలో రూ.233 కోట్లు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో సీనరేజి వసూళ్ల కాంట్రాక్టు గడువు ముగియడంతో మళ్లీ దక్కించుకునేందుకు సుధాకర్ ఇన్‌ఫ్రా పావులు కదుపుతోంది. గత నెల 13వ తేదీతో కాంట్రాక్టు రద్దవడంతో తిరిగి వర్క్ ఆర్డరు తెచ్చుకునేందుకు పైరవీలు ముమ్మరం చేసింది. గత వైసీపీ హయాంలో అడ్డగోలుగా ఈ కంపెనీకి జగన్ సర్కారు రెండేళ్లపాటు సీనరేజీ వసూలు కాంట్రాక్టు కట్టబెట్టేసింది. దీంతో ఎక్కడికక్కడ ముక్కుపిండి సీనరేజీ వసూళ్లు చేసి కోట్లకు కోట్లు లాభాలు అర్జించారు. అయితే గడువు ముగియడంతో సదరు సంస్థ తిరిగి మళ్లీ దక్కించుకునేందుకు తెగ ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం టెండర్లు పిలిస్తే కాంట్రాక్టు దక్కుతుందో లేదోనన్న అనుమానంతో ముందే పైరవీలకు దిగుతోంది. నెల్లూరుకు చెందిన సదరు కాంట్రాక్టరు ఇప్పటికే గనుల శాఖకు రూ.25 కోట్ల వరకు బాకీ పడ్డారు.అధికారులు ఒత్తిడి తెచ్చినా కట్టలేదు.మరో పక్క ఇటీవల కాంట్రాక్టు గడువు ముగుస్తోన్న సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సదరు కంపెనీ ప్రతినిధులు బిల్లులే లేకుండా నేరుగా నగదు వసూలు చేయడం వివాదాస్పదమైంది.

### అప్పట్లో అప్పనంగా కొట్టేసి...

ఉమ్మడి జిల్లాలో భారీ నల్లరాతి కొండలు, గ్రావెల్, మట్టి,లేటరైట్ తవ్వకాలకు అనుమతులివ్వడం ద్వారా ఏటా కోట్లలో ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, సీతానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా గనుల శాఖకు అధిక రాబడి వస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గనుల శాఖకు ఏటా రూ.407 కోట్ల వరకు రాబడి వచ్చేది. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు దీనిపైనే కన్నేశారు. చిన్న తరహా ఖనిజాల సీనరేజి వసూలు బాధ్యత నుంచి గనుల శాఖను పక్కన పెట్టి మూడో కంటికి తెలియకుండా మొట్టమొదటిసారిగా సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టేశారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు ఇచ్చారు. రెండేళ్లకు కలిపి కేవలం ప్రభుత్వానికి రూ.233 కోట్లు చెల్లిస్తే చాలని షరతు విధించారు. అది కూడా నెలకు రూ.9.70 కోట్ల చొప్పు న 24 వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు ఇచ్చారు. భారీగా ఆదాయం పిండాల్సిన చోట కారుచౌకగా కట్టబెట్టేసి తెరవెనుక అప్పటి ప్రభుత్వ పెద్దలు కోట్లలో నొక్కేశారు.

### మళ్లీ మాకే దక్కాలి...

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సీనరేజీ కాంట్రాక్టు రద్దయి 25 రోజులు అవుతోంది. దీంతో తిరిగి ప్రభుత్వం కొత్తగా టెండర్లు పిలిచి సీనరేజీ వసూలు అర్హత గల కంపెనీకి కట్టబెట్టాలి. అయితే ఇంకా కసరత్తు మొదలవలేదు. ఇటీవల ప్రభుత్వం కొన్ని ఉమ్మడి జిల్లాలకు కొత్తగా సీనరేజీ వసూళ్లకు ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచింది. గడువు ముగిసిన జిల్లాలకు ఇంకా టెండర్లు పిలవలేదు. త్వరలో వీటిని జారీ చేసే అవకాశం ఉంది. కొత్త కంపెనీ ఖరారయ్యే వరకు ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో గనులశాఖ సీనరేజీ వసూలు చేస్తోంది. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు స్వీకరిస్తోంది. ఈ క్రమంలో అసలు ఎవరు చెల్లిస్తున్నారు? ఎవరు చెల్లించకుండా ఖనిజాలను తరలిస్తున్నారనేది గనులశాఖ అసలు పట్టించుకోవడం లేదు. మరో పక్క కొత్త టెండర్లు పిలిస్తే పోటీ పెరిగి తనకు కాంట్రాక్టు దక్కదనే ఆందోళన సుధాకర్ ఇన్‌ఫ్రాను వేధిస్తోంది.గత వైసీపీ హయాంలో ఉమ్మడి జిల్లా సీనరేజీ వసూలు కాంట్రాక్టును తెర వెనుక లాలూచీతో రెండేళ్లకు కేవలం రూ.233 కోట్లే చెల్లించేలా కారుచౌకగా కొట్టేసింది.ఇప్పుడు కొత్తగా టెండర్లు పిలిస్తే ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజీ డబ్బులను భారీగా పెంచాలి. దాదాపు రెట్టింపుస్థాయిలో అయినా బిడ్ అమౌంట్ పెంచాల్సి ఉంటుందని అధికారులే చెబుతున్నారు. తద్వారా ఖజానాకు ఆదాయం పెరుగుతుంది. సదరు కాంట్రాక్టరు మాత్రం టెండర్ల వరకు వెళ్లకుండా మళ్లీ పాత ధరకే కారుచౌకగా వసూళ్ల కాంట్రాక్టు కొట్టేయాలని ప్రయత్నం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొండలు, గుట్టలు, గ్రావెల్‌క్వారీలు ఉన్న ప్రతి చోటా సదరు సంస్థ సొంతంగా మనుషులను నియమించి, మైనింగ్ ఏరియాలో సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఎవరు ఏ చిన్న మట్టి,గ్రావెల్ తవ్వకున్నా ముక్కుపిండి సీనరేజి వసూలు చేసింది. ప్రత్తిపాడు,తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్లరాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి వదల కుండా ముక్కుపిండి నెలనెలా కోట్లలో డబ్బులు పిండేసింది.ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ.9.70 కోట్లకు బదులు రూ.15 కోట్లకు పైగా వసూలు చేసింది.ఈ కంపెనీకి గత నెల 13తో సీనరేజీ వసూలు కాంట్రాక్టు రద్దయిపోయింది.పోతూపోతూ సదరు కంపెనీ ప్రతినిధులు ఉమ్మడి జిల్లాలో బిల్లులు లేకుండా నేరుగా నగదు వసూళ్లకు దిగింది. దీంతో రౌతులపూడి, కోనసీమ జిల్లాల్లో జనం తిరగబడ్డారు.

### బకాయి రూ.25 కోట్లు

సదరు కాంట్రాక్టరు ప్రభుత్వానికి రూ.25 కోట్ల వరకు బాకీ పడ్డారు. గత వైసీపీ హయాంలో రౌతులపూడిలో అర బిందో సంస్థ నిర్మించే కొత్త పోర్టు కోసం భారీ నల్లరాయి కొండను కేటాయించారు.ఇందుకోసం ఆ కంపెనీ ప్రభుత్వానికి సీనరేజీ కట్టాల్సి ఉంది. కానీ అరబిందో కోసం జగన్ సర్కారు ఒక్క రూపాయి కూడా సీనరేజీ గనులశాఖకు కట్టక్కర్లేకుండా రూ.20 కోట్ల వరకు మినహాయింపు ఇచ్చేసింది. అరబిందో కోసం రద్దు చేసిన సీనరేజీ వల్ల తన రాబడి తగ్గిపోయిందని రూ.20 కోట్ల సీనరేజీ డబ్బులో కొంత వాటా తన పాత బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ అప్పట్లో గనులశాఖను సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా కోరింది.ఈలోపు ఎన్నికలు వచ్చేయడంతో సదరు కాంట్రాక్టర్ అనుకున్న పనికాలేదు. ఈలోపు ప్రభుత్వం మారడంతో అధికారులేమో సర్దుబాటు కుదరదని, డబ్బులు చెల్లించాలని తెగేసి చెప్పారు. అయినా ఇంకా ఈ సంస్థ బాకీలు చెల్లించ లేదు. తిరిగి నష్టపోయాననంటూ ఇప్పుడు కొత్తగా కాంట్రాక్టు కొట్టేయడానికి పావులు కదుపుతోంది.

## గో..గో.. గోల్డ్!



### బంగారం ధర పరుగు

**భారీగా పెరుగుతున్న ధరలు**

**22 క్యారెట్ 10 గ్రాములు రూ.94,700**

**24 క్యారెట్ 10 గ్రాములు రూ.1,03,300**

**వెండి కేజీ రూ.లక్షా 18వేల 100**

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వరలక్ష్మి వ్రతం రోజున బంగారం ధర భారీగా పెరిగింది. బంగారం ధరల పెరుగుదల చూసి సామాన్య మధ్యతరగతి ప్రజలు నిరాశకు గురవుతున్నారు.వారికి బంగారంగానే మారిపోయింది. పెళ్లిళ్లు, ఇతర పండగలకు బంగారం కొనడం ఆనవాయితీగా మారింది. కానీ ఈ ఏడాది జనవరి నుంచి ఒకటే పెరుగుదల. ముందు ముందు ఇంకా పెరిగిపోతుందేమోననే భయం. దీంతో అప్పో సప్పో చేసి కాస్తో కూస్తో బంగారం కొనుగోలు చేయాలనే ఆశ మొదలైంది. కానీ ధరలు పెరిగిపోతుండడంతో సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు నిరాశ కలుగుతోంది.ఇంత ధరకు చేరడం ఇదే మొదటి సారని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం రాజమండ్రి మార్కెట్‌లో 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.94 వేల 700 లకు చేరింది. ఇక 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర లక్ష ఎప్పుడో దాటేసింది. ప్రస్తుతం ఒక లక్షా 3 వేల 300గా ఉంది. ఇక వెండి ధర లక్షకు పైగా దాటేసింది.ప్రస్తుతం కిలో వెండి ధర రూ.ఒక లక్షా 18 వేల 100గా ఉంది. బంగారం వెండి ధరలు పోటీపడుతున్నాయి.గతంలో వెండి ధర కేజీ రూ.50 వేల లోపే ఉండేది. ప్రస్తుతం అది అమాంతం పెరిగిపోతోంది. ఎక్కడా తగ్గుదల లేదు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రతి ఒక్కరూ బంగారు రూపు కొనుక్కోవడం ఆనవాయితీ.ఈ ఏడాది మాత్రం వాయిదా వేసుకున్నారు. రూపు లేకుండా పూజ కానిచ్చారు.

## లక్ష్మీదేవి.. రూపులక్యూ..



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8( ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సింహచల్‌నగర్ శ్రీవరాహలక్ష్మీన్ర సింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఐదు వేల గోల్డ్‌ప్లేటెడ్ లక్ష్మీదేవి రూపులను పంపిణీ చేశారు. రూపులకు భక్తులు క్యూకట్టారు.దీంతో కోరుకొండ రోడ్డు సింహచల్‌నగర్‌లో కిక్కిరిసింది. ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసి భక్తులకు గోల్డ్‌ప్లేటెడ్ రూపులను అందించారు.

## కురిసింది వాన



రాజమహేంద్రవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా మండిపడుతున్న ఎండలతో ఇబ్బంది పడిన నగరవాసులకు శుక్రవారం రాత్రి పడిన వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. సాయంత్రం నుంచి మేఘావృతమైనా..రాత్రి 9గంటల సమయంలో ప్రారంభ మైన వాన జోరుగా కురిసింది. దీంతో నగరంలోని పలు జంక్షన్లు జలమయమ్యాయి. వరలక్ష్మీ వ్రతం కావడంతో సాయంత్రం సరదాగా బయటకు వెళ్లినవారు, దేవాలయాలకు, మార్కెట్లకు వెళ్లిన వాళ్లకు ఇబ్బందులు తప్పలేదు. ఇటీవల అడపాదడపా వర్షం పడుతున్నా అది ఒక ప్రాంతానికి పరిమితమై నీళ్ల చిలకరింపులా ఉంటోంది. అయితే శుక్రవారం రాత్రి జోరు వాన కురవడంతో నగరంలో వాతావరణం చల్లబడింది.

## యూరియా..ఏదయా!



కొవ్వూరు,ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా అందుబాటులో లేక అన్నదాతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సార్వాలో నారు వేసిన 30 రోజుల్లో ఎరువులు వేయాలి.. యూరియా కొరత కారణంగా 50 రోజులు దాటినా వేయలేదు.కొందరు వ్యాపారులు పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని రూ.270ల బస్తా రూ.400 నుంచి రూ.500ల వరకు విక్రయిస్తున్నారు.దీంతో రైతాంగం లబోదిబోమంటున్నారు. వ్యవసాయ అధికారులకు ముందు చూపు లేక ఈ పరిస్థితి ఏర్ప డిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదించి రైతులకు అవసరమైన యూరియాను సరఫరాచేసి అన్న దాతలను ఆదుకోవాలని రైతు సంఘం నాయకుడు కెవికె రంగారావు డిమాండ్ చేశారు.

## తెలుగు.. వెలుగేది!




### ఇంకనూ ఆరంభం కాని తెలుగు వర్శిటీ

- నోటిఫికేషన్ ఇచ్చి రెండు నెలలు
- ఏర్పాటు కాని ప్రధాన కార్యాలయం
- వైస్ చాన్సలర్ ఊసు లేదు
- ఈ ఏడాది తరగతుల సంగతేంటో
- ప్రభుత్వ నిర్ణయంతో ప్రాణం
- ఇంకనూ ఊపిరిపోసుకోని వైనం
- శిథిలావస్థకు చేరిన భవనాలు
- భాషాభిమానుల ఎదురుచూపులు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపి, నోటిఫికేషన్ కూడా ఇచ్చిన సంగతి తెలిసిందే. రెండు నెలలు దాటినా ఇంకా బొమ్మూరు తెలుగు వర్శిటీ ఆవరణలో ఎలాంటి కదలిక లేదు.2024- 25 విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ అడ్మిషన్లు ఆగిపోయాయి. ఫైనల్ విద్యార్థుల పరీక్షలు ఇటీవల పూర్తయ్యాయి. సాధారణంగా జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టులో తరగతులు ఆరంభిస్తారు. కానీ ఇంకా వీసీ,రిజిస్ట్రార్, ఫ్యాకల్టీ నియామకాలు ఏమీ లేకపోవడంతో ఈ ఏడాది అడ్మిషన్లపై సందేశం కలుగుతోంది.

### రాష్ట్ర విభజన తర్వాత..

2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఏపీలో తెలుగు పీఠం ఉనికి కోల్పోయింది. బొమ్మూరు తెలుగు పీఠంలో గతేడాది నుంచి అడ్మిషన్లు ఆగిపోయాయి. ఈ ఏడాది జూలై 3న ఎంఏ తెలుగు చివరి బ్యాచ్ పరీక్షలు పూర్తి కావడంతో పీఠం ఉనికి ప్రశ్నార్థకమైంది. ఈ పరిస్థితిలో రాజమండ్రిలో తెలుగు వర్శిటీ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన తెలుగు కు వెలుగునిచ్చింది.1986 ఏప్రిల్‌లో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ నందమూరి తారక రామారావు హైదరాబాద్‌లో ఉన్న తెలుగు వర్శిటీలో భాగంగా బొమ్మూరులో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పీఠం ఏర్పాటు చేశారు. బొమ్మూరు కొండపై సుమారు 45 ఎకరాలు, సమీపంలోని మరో 10 ఎకరాల భూమిని పీఠానికి దఖలు పరిచారు.పీఠంలో 300మంది పీహెచ్‌డీలు చేయగా, 450 మంది ఎంఫిల్, 550 మంది తెలుగు ఎంఎ చేశారు.

### ఇదీ ప్రస్తుత పరిస్థితి

ప్రస్తుతం పీఠంలో 14 మంది ఉద్యోగులు ఉన్నారు. భవనాలు శిథిలమయ్యాయి. కేవలం 20 ఎకరాల స్థలం మాత్రం మిగిలింది. కానీ 29 వేల పుస్తకాలతో గ్రంథాలయం మాత్రం నిత్యనూతంగా ఉండడం గమనార్హం. 2016 వరకూ ఇక్కడ అన్ని కోర్సులు జరిగాయి. 2024-25 నుంచి మొత్తం అడ్మిషన్లు ఆగిపోయాయి. ఉద్యోగులకు జీతాలు కూడా రాని పరిస్థితి ఉంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఓఎస్‌డీని నియమించి జీతాలు ఇస్తున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుతో తెలుగు నేల పొంగి పరవశించిపోతున్నట్టు ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఇక్కడ తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రముఖులు కోరిన సంగతి తెలిసిందే.చివరికి ప్రజల కోరికను చంద్రబాబు నెరవేర్చారు.రెండు నెలల కిందట అమరావతిలో జరిగిన కేబినెట్ సమావేశంలో రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.ఈ మేరకు నోటిఫికేషన్ జారీ అయినట్టు ప్రకటించింది. ఏపీలో విశ్వవిద్యాలయం కార్యకలాపాలు ప్రారంభానికి వీలు కల్పించింది. ఏపీలో ఉన్న మూడు సాహిత్య పీఠాల నిర్వహణకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుందని కేబినెట్ విశదీకరించింది.ఈ మేరకు ప్రభుత్వం తక్షణం వీసీని నియమించి తెలుగువిశ్వవిద్యాలయ పాలన ప్రారంభించాలని..ఈ ఏడాది నుంచి తరగతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

## సీపీఐ జిల్లా కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8( అంధ్ర జ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శిగా రెండో సారి తాటిపాక మధు ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. సీపీఐ రాష్ట్ర నాయకుల సమక్షంలో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా కార్యదర్శిగా తాటిపాక మధు,సహాయ కార్యదర్శులుగా కుండ్రపు రాంబాబు, రేఖా భాస్కరరావు, సహాయ కార్యవర్గ సభ్యులుగా వి.కొండలరావు, కే.జ్యోతిరాజు, పంతం నాగేశ్వర రావు, పి.లావణ్యతోట లక్ష్మణ్, చింతల పూడి సునీల్, పి.త్రిమూర్తులు, కే.శ్రీనివాస్ ఎంఎస్‌కే.ప్రసాద్ ఎన్నికయ్యారు.



## సజీవనది..

### కష్టమొస్తే గోదారిలో దూకేస్తున్నారు

### శుక్రవారం మూడు కేసులు నమోదు

గోదారి.. ఆత్మహత్యలకు దారిగా మారిపోయింది.. ఎవరికైనా చిన్న కష్టం వస్తే ముందు వెనుకా ఆలోచించడంలేదు.. రోడ్ కం రైలు బ్రిడ్జి ఎక్కుతున్నారు.. గోదావరిలో దూకేస్తున్నారు.. శుక్రవారం కొవ్వూరులో జరిగిన సంఘటనలే అందుకు నిదర్శనం.. ఉదయం ఒక గుర్తుతెలియని మృతదేహాన్ని గోష్పాదక్షేత్రంలో గుర్తించి బయటకు తీశారు.. ఆ వెంటనే మరొక మహిళ రోడ్ కం రైలు బ్రిడ్జి పైనుంచి దూకేసి గల్లంతైంది ..ఈ కేసు చూస్తుండగానే మద్దురూలంక వద్ద గోదావరిలో మరో వృద్ధుడు దూకేశాడు.ఇలా శుక్రవారం పోలీసులు గోదావరి చుట్టూ పరుగులు పెట్టారు..

8

### నల్లజర్లలో 'సుపరిపాలన'

# విజయోత్సవ ర్యాలీకి తరలి రండి

నల్లజర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో శనివారం నిర్వహించే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం విజయోత్సవ ర్యాలీకి మండలంలోని కూటమి శ్రేణులు తరలి రావాలని ఏఎంసీ చైర్మన్ యద్ధనపూడి బ్రహ్మారాజు, పోతవరం మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్ పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా సాయంత్రం ఐదు గంటలకు అక్షయ పాత్ర రెస్టారెంట్ వద్ద నుంచి భారీ ర్యాలీతో ఎస్ఆర్‌కే కళాశాలకు చేరుకుంటామన్నారు. అలాగే మధ్యలో ఉన్న అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళి సమర్పణ ఉంటుందన్నారు. వచ్చిన కూటమి శ్రేణులకు ఎస్ఆర్‌కే కళాశాలలో విందు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

## ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ యూనిట్


మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, ఆగసు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంలో రూ. లక్షా 50 వేలతో ఉచితంగా వారి ఇంటికి సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవ రపల్లిలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు శ్లాబులుంటే వారికి సోలార్ యూనిట్‌ను ఉచితంగా కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుం దన్నారు. మండలంలో 4500 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగలవారు ఆధార్, కరెంట్ బిల్లు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సులను యర్నగూడెం, దేవరపల్లి విద్యుత్‌శాఖ సబ్‌స్టేషన్లలో సమర్పించాలన్నారు.

## ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 11 ఫిర్యాదులు


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రజల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో 11 ఫిర్యాదులు స్వీకరించామని, వాటిలో కొత్త రేషన్‌కార్డులు, హెల్త్ పింఛను, జనన ధ్రువీకరణ పత్రంలో పేరు మార్పుచేయాలని, బ్రిడ్జిపేటలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రాలు అందించడం జరిగిందన్నారు. ప్రజల నుంచి గ్రీవెన్స్‌లో స్వీకరించిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో కార్డన్‌సెర్చ్

● సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


సిబ్బందికి ఆదేశాలిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్

నిడదవోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు అకస్మాత్తుగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తుం టామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జగనన్న కాలనీలో ఉదయం ఐదు గంటలకే జిల్లా ఎస్పీ డీ.నరసిం హ కిషోర్, కొవ్వూరు డీఎస్పీ జీ.దేవ కుమార్ ఆదేశాలతో సిబ్బంది నిర్వ హించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీలో అణువణువునా తనిఖీలు నిర్వహించారు. ఇందులో సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సైలు జగన్మోహనరావు, బాలాజీ సుందరరావు, పరమహంస, పోలీస్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం


కొవ్వూరు గోష్పాదక్షేత్రం బాలాత్రిపుర సుందరిని దర్శించుకుంటున్న మహిళలు


సౌభాగ్య దుర్గాంబిక ఆలయంలో లలితా విష్ణుసహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు


నల్లజర్లలో దర్శనమిస్తున్న ముత్యాలమ్మవారు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం వేకువజామునే లేచి గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. నిత్యవసరాలు, పండ్లు, పువ్వులు, బంగారు రూపులు, పత్రులతో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి, సంస్కృత పాఠశాల ప్రాంగణంలో వేంచేసియున్న లలితపార్వతీ అమ్మవారు, వారాహిమాత, గ్రామదేవత కొవ్వూరమ్మ అమ్మవార్ల ఆలయాల్లో పూజలు చేశారు. అలాగే కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అఖండ గోదావరి మాతకు శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని మహా నీరాజనం అందజేశారు. గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదోషకాలంలో క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో వేంచేసియున్న గోదావరిమాత ఆలయం వద్ద అష్టోత్తర శత కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం 239వ మాసోత్సవ మహానీరాజనాన్ని పురస్కరించుకుని గోదావరి మాతకు వివిధ హారతులతో నీరాజనం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**దేవరపల్లి:** శ్రావణ శుక్రవారం సందర్భంగా అన్ని ప్రధాన దేవాలయాల్లోనూ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇళ్ల వద్ద మహిళలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. స్థానిక మూడుబొమ్మల సెంటర్ వద్ద ఉన్న సౌభాగ్య దుర్గాంబిక ఆలయంలో మహిళాభక్తులు లలితా విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు.

**నల్లజర్ల:** ఆవపాడు గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి, విజయ దుర్గాదేవికి శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలంతా లలితా సహస్రనామ పారాయణం చేశారు. తర్వాత అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**ఉండ్రాజవరం:** శ్రావణ శుక్రవారం సందర్భంగా పాలంగిలో కనకదుర్గ అమ్మవారిని ఆలయ కమిటీ వారు రూ.4.50 లక్షల కరెన్సీతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే మండలంలో పలు దేవాలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


పాలంగిలో కనకదుర్గను కరెన్సీ నోట్లతో అలంకరించిన దృశ్యం

# భూగర్భజలాల వినియోగం, లభ్యతపై నమోదు తప్పనిసరి


వేలచింతలగూడెంలో చెరువు వివరాలు నమోదు చేస్తున్న ఏఎస్‌వో, తదితరులు

గోపాలపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాల వినియోగం, లభ్యతపై నమోదు తప్పనిసరి అని ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. 7వ చిన్నతరహా నీటివనరుల గణనలో భాగంగా వేలచింతలగూడెం చెరువులను, రైతుబోరులను శుక్రవారం పరిశీలించి నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలలోని ఆయా గ్రామాల్లో 2125 బోర్లు, 32 చెరువులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 7వ చిన్నతరహా నీటివనరుల గణనతో పాటు రెండో వాటర్ బాడీకరణ రెండు కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్టు తెలి పారు. మండలంలోని నందిగూడెం, వేలచింతలగూడెం గ్రామాల్లో రైతు బోర్లను, చెరువులను పరిశీలించినట్లు తెలిపారు. ప్రతీరైతు తన వ్యవసాయ క్షేత్రంలో ఉన్నటువంటి బోర్లను వాటి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. అందులో భాగంగా నీటి వినియోగం పూర్వం బోర్లు వేసేందుకు అయిన ఖర్చు, ప్రస్తుతం పెట్టే ఖర్చు నమోదు చేయాల్సి ఉందన్నారు. బోరు వేసుకున్న రైతు ప్రభుత్వం నుంచి ఏదైనా సబ్సిడీ పొందారా లేదా అని 40 ప్రశ్నలు రైతులను అడిగి వివరాలు సేకరించారు. ఇలా సేకరించిన సమాచారాన్ని నిక్షిప్త సమాచారం సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రెవిన్యూ అధికారులు కాంతారావు, రాంబాబు, వీఆర్‌పీ సత్యవతి, రైతులు ఉన్నారు.

### బూరుగుపూడి 'సొసైటీ' చైర్మన్‌గా కేశవరావు

కోరుకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా బూరుగుపూడికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మండల రైతు సంఘం నాయకుడు కంటే నాగ కేశవరావు, సభ్యులుగా బాలిన వెంకటేష్, యర్రంశెట్టి సూర్యనారాయణ నియమితులయ్యారు.

### బీజేపీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

నిడదవోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ఎలక్షన్ కమిషన్ కుమ్మక్కయి రాజ్యాంగాన్ని అవమానపరచి అప్రజా స్వామికంగా అధికారంలోకి వచ్చారని కాం గ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేడ వరపు భద్రందొర అన్నారు. శుక్రవారం పట్ట ణంలోని సంత మార్కెట్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, అగర్వాల హీరాలాల్, భావన రమేష్, బుద్దన లక్ష్మణరావు, నాగూర్, కాకి కిషోర్, అన్వర్ ఖాన్, గుర్రంరమేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత


కవులూరులో సాయాన్ని అందిస్తున్న యంగ్ విజన్ యూత్ సభ్యులు

నల్లజర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కవులూరుకి చెందిన బండి శారదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆమెకు ఉన్న 10 సంవత్సరాల కుమారుడికి 25 కేజీల బియ్యం, రూ. నాలుగు వేల నగదును గ్రామానికి చెందిన యంగ్ విజన్ యూత్ సభ్యులు శుక్రవారం అందించారు.

### దొంగతనంపై కేసు నమోదు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఫైర్ వర్క్స్ సెంటర్‌లో ఇనుపగొట్టాలు దొంగిలించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. చాగల్లుకి చెందిన ఫయిజుల్లా బేగ్ పంగిడి గ్రామశివారులో ఫైర్ వర్క్స్ సెంటర్ నడుపుతున్నాడు. ఈనెల 5వ తేదీన షెడ్డు నిర్మాణానికి తెచ్చిన ఇనుప రేకులు, 12 గొట్టాలు ఎవరో దొంగిలించుకుపోయారని ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## ప్రజలతో మమేకమై పనిచేయాలి

● కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ప్రతి నెలా 1వ తేదీన అర్హత కల్గిన లబ్ధిదారులకు వారి నివాసాల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని 49వ డివిజన్‌లో కలెక్టర్ పర్యటించారు. పించన్ల పంపిణీ ప్రక్రియపై పంపిణీ అధికారులు, లబ్ధిదారులు, ప్రజలతోను మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల సచివాలయ సిబ్బంది బదిలీల నేపథ్యంలో కొత్త ప్రదేశాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది స్థానిక ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. వారిని అర్థం చేసుకోవడంతోపాటు సేవలందించడంలో తగిన ప్రాధాన్యత చూపాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలువురు తమకు పింఛన్లు రాలేదని, తల్లికి వందనం డబ్బులు పడలేదని, రేషన్‌కార్డులు కావాలని, ఇంటి స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై కలెక్టర్ స్పందిస్తూ ఆయా ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి వాటి యథార్థస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ అధికారి శైలజావల్లి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి, ఇతర అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. దొమ్మేరుకి చెందిన కొల్లి గంగరాజు ఈనెల 7వ తేదీన మనెల్లి పోసియ్య, నాని బస్సుకు అడ్డంగా నిలబడి చెయ్యి చేసుకున్నారు. దీంతో ట్రాఫిక్‌జామ్ కావడంతో చుట్టుపక్కల వారు వచ్చి సర్ధి చెప్పి పంపించేశారు. గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

### చంపుతానని బెదిరించినవారిపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చంపుతానని బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. బంగారంపేటకు చెందిన కర్రి నవీన్‌కుమార్, అతని పిన్ని సువర్ణరత్నంకు ఇంటిముందు వేసిన కంకర విషయంలో మూడురోజుల క్రితం ఘర్షణ జరిగింది. దీంతో సువర్ణరత్నం బంధువులు శేఖర్, సురేష్, కిరణ్ నవీన్ ఇంటిలోకి వచ్చి తలపై కొట్టి గాయపర్చడంతో పాటు చంపుతానని బెదిరించడంతో పట్టణ పోలీసులకు నవీన్ ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

# వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

● గోదావరిలో దూకి వృద్ధుడు ● ఏపీ టూరిజం బోటు పాయింట్ వద్ద మరొకరు..

కొవ్వూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గోదావరిలో దూకి వృద్ధుడి మృతి చెందాడు. వివరాలివి.. మద్దూరులంకకి చెందిన తాటి విశ్వేశ్వరరావు (65) పెళ్లి సంబంధాలు కుదుర్చుతుంటాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మద్దూరులంక, బొబ్బర్లంక మధ్య గల బ్యారేజ్ వంతెనపై నుంచి గోదాట్లో దూకేశాడు. అక్కడ ఉన్న జాలర్లు పడవల సహాయంతో విశ్వేశ్వరరావును గుర్తించి బయటకు తీసుకువచ్చారు. అప్పటికే ఆయన మృతిచెందాడు. అలాగే గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం గోష్పాదక్షేత్రంలోని ఏపీ టూరిజం బోటు పాయింట్ వద్ద 35 నుంచి 40 సంవత్సరాల మగ మృతదేహం తేలుతుందని స్థానికులు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక జాలర్ల సహాయంతో నది నుంచి బయటకు తీయించారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు. మృతదేహం డీ కంపోజ్ కావడంతో గుర్తుపట్టడానికి వీలులేకుండా తయారయ్యింది. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు పట్టణ పోలీస్టేషన్‌లో సమాచారం అం దించాలన్నారు. వీఆర్వో విప్పర్తి మంగాయమ్మ అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ జీ.శ్రీనివాస్ తెలిపారు.


విశ్వేశ్వరరావు మృతదేహం

### గోదావరిలో దూకేసిన మహిళ

రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకిన మహిళ గల్లంతయ్యింది. పట్టణ పోలీసులు, స్థానికులు అందించిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరం నుంచి సుమారు 30 వయస్సు కలిగిన మహిళ ఆటోలో కొవ్వూరు బయలుదేరింది. బ్రిడ్జిపై 151వ స్థంభం వద్ద ఆటో ఆపమని చెప్పి ఒక్కసారిగా వంతెనపై నుంచి దూకేసింది. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు బోటులో మహిళ గురించి గాలింపు చర్యలు చేపట్టారు. ఇంకా ఆచూకీ తెలియరాలేదు. దీనిపై కేసు నమోదు కావాల్సి ఉంది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడిన సంఘటన కాపవరంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కొవ్వూరు పట్టణానికి చెందిన కల్లూరి పైడిరాజు, బడే సత్యవతి బైక్‌పై దేవరపల్లి నుంచి కొవ్వూరు బయలుదేరారు. కాపవరం ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ మధ్యలో డివైడర్‌ను ఢీ కొట్టారు. దీంతో బైక్ పై ఉన్న ఇద్దరూ కింద పడిపోయారు. తల, చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## కర్రతో కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చుని ఇరువురు ఘర్షణ పడిన సంఘటన కొవ్వూరు పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఆరికిరేవులకి చెందిన మట్టా ఆంజనేయులు యూరియా కోసం శ్రీరామ పీఏసీఎస్‌కు వచ్చి క్యూలైన్‌లో నిలబడ్డాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మల్లిపూడి నాగరాజు వచ్చి క్యూలైన్‌లో నిలబడకుండా ముందుకు వెళ్లిపోవడంతో ఆంజనేయులు క్యూలైన్‌లో నిలబడమని అడగడంతో ఇరువురి మధ్య తగాదా జరిగింది. ఈ ఘటనలో నాగరాజు ఆంజనేయులును కర్రతో కొట్టి గాయపర్చాడు. ప్రస్తుతం ఆంజనేయులును చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు మహిళా హెచ్‌సీ లలిత తెలిపారు.

### కారుణ్య నియామక పత్రం అందజేత

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని సీజేఆర్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తూ మరణించిన మందాలపు నాగలక్ష్మి ఉద్యోగాన్ని కారుణ్య నియమకంలో భాగంగా ఆమె భర్త నాగబాబుకి ఇచ్చారు. దీనిలో భాగంగా శుక్రవారం నియమక పత్రాన్ని కలెక్టర్ అందించి మాట్లాడుతూ నాగబాబుకి జూనియర్ అసిస్టెంట్‌గా కారుణ్య నియామక పత్రాన్ని ఇవ్వటం జరిగిందన్నారు. క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.





పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, యోగా ఈవెంట్ నిర్వహిస్తున్న చాగల్లు హైస్కూలు విద్యార్థినులు

# చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

» కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు » చాగల్లు హైస్కూల్లో రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ ప్రారంభం

చాగల్లు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు హైస్కూల్లో రాష్ట్రస్థాయి జూనియర్ బాల, బాలికల మిక్స్‌డ్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కొవ్వూరులో నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యమివ్వాలన్నారు. శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు క్రీడా సామగ్రి కిట్లు అందజేయడానికి రూ.30వేలు చొప్పున కేటాయించామన్నారు. త్వరలోనే సామగ్రి కొనుగోలు చేసి పాఠశాలలకు ఇస్తామన్నారు. క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వం ఇచ్చే నగదు పారితోషికాన్ని పెంచినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో క్రీడల అభివృద్ధికి విప్లవాత్మకమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కడపలో స్పోర్ట్స్ స్కూల్ అభివృద్ధికి రూ. 40 లక్షలు కేటాయించి నట్టు చెప్పారు. రాష్ట్రంలో 110 క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తి, టీమ్ స్పిరిట్ కలిగి ఉండాలన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పదికి పైగా జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కరుటూరి సతీష్, ఎస్ఎంసీ చైర్మన్ కొఠారు గోపాలకృష్ణ, కూటమి నాయకులు తాళ్లూరి హరిశ్చంద్ర ప్రసాద్, ఈదుపుగంటి సుబ్బారావు, తాళ్లూరి వర ప్రసాద్, మిరియాల సతీష్, వివిధ పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు, సుమారు 250 మంది క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.


పోటీల్లో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు

### సెమీఫైనల్‌కి చేరిన జట్లు ఇవే...

చాగల్లు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నాల్గవ జూనియర్ బాల బాలికల మిక్స్‌డ్ టార్గెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సెమిఫైనల్‌కి చేరిన జట్లు వివరాలను నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పి. నాగరాజు, జే. విజయలక్ష్మి విలేఖరులకు తెలిపారు. బాలికల విభాగంలో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో విజయనగరంపై తూర్పుగోదావరి జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కి చేరింది. మరొక పోటీలో ప్రకాశం జిల్లా జట్టుపై పశ్చిమ గోదావరి జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కి చేరింది. బాలుర విభాగంలో నంద్యాలపై తూర్పుగోదావరి జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కి చేరింది. మరొక పోటీలో శ్రీకాకుళంపై విశాఖపట్నం గెలిచి సెమీఫైనల్‌కి చేరింది.

### ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పరిశీలన

రాజానగరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎదురుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి సంబంధిత అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఇటీవల మండలంలోని చక్రద్వారబంధం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు గ్రామస్థులు చేసిన విజ్ఞప్తి మేరకు నాలుగు రోజుల కిందట ఎమ్మెల్సీ సోము వీర్రాజు విజయవాడలో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతో చర్చలు జరిపారు.